

RNI No: APTEL /2009/28733 Est:2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి: 23, సంచిక: 148 తిరుపతి తేది : ఆదివారం 27, సెప్టెంబర్ 2026 పేజీలు: 8, ధర: రూ. 6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPURAM, KURNOOL DISTRICTS

సోషల్ మీడియా ఫిర్యాదుపై

## పవన్ కల్యాణ్ స్పందన

పరవాడ ఫార్మాసిటీలో 95 పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు




**ఆంధ్రనాడు – అనకాపల్లి, సెప్టెంబరు 26:** సోషల్ మీడియాలో వచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించడంతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థ జలాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు చేపట్టింది. ఆయా పరిశ్రమలు ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని పీసీబీ ఆదేశించింది. పరవాడ ఫార్మాసిటీ పరిసర ప్రాంతాల్లోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్న దృశ్యాలకు సంబంధించిన వీడియో ఒకటి శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యక్షమైంది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారించాలని, సమగ్ర నివేదిక అందజేయాలని పీసీబీ అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో పీసీబీ అధికారులు పరవాడ ఫార్మాసిటీ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. సోషల్ మీడియాలో ప్రసారమైన వీడియోలో కనిపించిన ప్రాంతాలను పరిశీలించడంతో పాటు అక్కడి నుంచి నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ప్రాథమిక పరిశీలనలో శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీలోని మొత్తం 95 పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వ్యర్థ జలాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ చర్యలు, పర్యావరణ నిబంధనల అమలుపై తమ వివరణను ఏడు రోజుల్లోగా సమర్పించాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు కేవలం నోటీసులకు సమాధానం ఇవ్వడంతో సరిపోదని, కాలుష్య నివారణకు పలు దిద్దుబాటు చర్యలు చేపట్టాలని పీసీబీ ఆదేశించింది. **మిగులు 2వ పేజీలో....**

ఈసీలో విభేదాల

## ప్రచారానికి తెర

ఏకగ్రీవ ప్రకటనతో అపోహలకు ముగింపు

రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను కాపాడటం అందరి బాధ్యత: చంద్రబాబు

ఎస్ఐఆర్‌పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనన్న ఎన్నికల సంఘం




**ఆంధ్రనాడు – అమరావతి, సెప్టెంబరు 26:** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వచ్చిన వార్తలు, ఊహాగానాలకు శనివారం వెలువడిన ఈసీ సంయుక్త ప్రకటనతో తెరపడిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కీలక సమావేశం అనంతరం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కలిసి విడుదల చేసిన ప్రకటనతో ఈ అంశంపై నెలకొన్న అనుమానాలు తొలగిపోయాయని ఆయన అన్నారు. ఈ మేరకు చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. భారత రాజ్యాంగ సంస్థల సమగ్రత, విశ్వసనీయతకు ఈ ప్రకటన మరోసారి బలాన్ని చేకూర్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి ఈసీలో విభేదాలు ఉన్నాయంటూ జరిగిన ప్రచారానికి తాజా వివరణతో ముగింపు లభించిందని తెలిపారు.

**ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని దెబ్బతీయొద్దు**

స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని పేర్కొంటూ.. గెలుపు, ఓటములను సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని సూచించారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టడం రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని చంద్రబాబు పేర్కొన్నారు. **మిగులు 2వ పేజీలో....**

భారీ వర్షాలతో

## ఉత్తరాంధ్ర అతలాకుతలం..



అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష

మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం

బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు

రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు

రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల

**ఆంధ్రనాడు – అమరావతి, సెప్టెంబరు 26:** గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. **మిగులు 2వ పేజీలో....**

భద్రతా మండలిలో

## శాశ్వత సభ్యత్వం..



అంతర్జాతీయ వేదికపై భారత్‌కు పెరుగుతున్న మద్దతు

పోర్చుగల్, మారిషస్ దేశాల నుంచి మద్దతు

జీ4 కూటమికి మార్షల్ ఐలాండ్స్ మద్దతు

**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అంతర్జాతీయ వేదికపై మద్దతు పెరుగుతోంది. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న 81వ సర్వసభ్య సభ సమావేశాల్లో పలు దేశాలు భారత్ వాదనకు అండగా నిలిచాయి. పోర్చుగల్, మారిషస్ దేశాలు నేరుగా భారత్‌కు మద్దతు ప్రకటించగా, మార్షల్ ఐలాండ్స్ జీ4 కూటమికి జై కొట్టింది. **మిగులు 2వ పేజీలో....**

## 10 శాతం వృద్ధి సాధ్యమే



ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీపై భారీ పెట్టుబడులు అవసరం

ఎంఎస్ఎంఈల్లోనూ ఏఐ వినియోగం పెరగాలి

నైపుణ్యాభివృద్ధి, శిక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

: నిర్మలా సీతారామన్

**ఆంధ్రనాడు – బెంగళూరు, సెప్టెంబరు 26:** భారత ఆర్థిక వ్యవస్థ 10 శాతం మార్కును దాటి వేగవంతమైన వృద్ధిని సాధించాలంటే అన్ని రంగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. భవిష్యత్ సాంకేతికతలపై పెట్టుబడులు పెంచడం, పరిశ్రమల్లో డిజిటల్ పరివర్తనను వేగవంతం చేయడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం ఇవ్వవచ్చని ఆమె అన్నారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన నిర్మలా సీతారామన్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి కీలక రంగాలను భవిష్యత్ ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదక శక్తులుగా అభివర్ణించారు. **మిగులు 2వ పేజీలో....**

## ఉగ్రవాదానికి కేరాఫ్ పాకిస్థాన్..


2లో

ఉగ్రవాదంతో స్నేహం కుదరదు: ఐరాసలో జైశంకర్

'ఆపరేషన్ సిందూర్'పై పాక్ పీఎం షెహబాజ్ షరీఫ్ ఆరోపణలకు కౌంటర్

ఉగ్రవాదాన్ని ఆపితేనే సంబంధాలు మెరుగుపడతాయని స్పష్టీకరణ

ఆపరేషన్ నిలిపివేతలో ట్రంప్ జోక్యం చేసుకున్నారన్న పాక్ వాదన

పాక్ డీజీఎంఓ అభ్యర్థన మేరకే ఆపరేషన్‌ను నిలిపివేశామని భారత్ వెల్లడి

విజయవాడ పేదలకు

## పట్టాభిషేకం...!



24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు

ఈ నెల 30న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పట్టాల పంపిణీ

617 ఎకరాలు.. రూ.9,800 కోట్ల విలువైన ఆస్తిపై పేదలకు హక్కులు

దశాబ్దాల నాటి ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత

**ఆంధ్రనాడు, విజయవాడ, సెప్టెంబర్ 26 :** దశాబ్దాలుగా విజయవాడ నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 30న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలు అందించనున్నారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం స్ఫూర్తితో విజయవాడలోనూ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి తమ ఇళ్లపై చట్టబద్ధమైన హక్కుల కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాలకు భరోసా కలగనుంది. విజయవాడలో ప్రతి ఎన్నికల సమయంలో ప్రధాన అంశంగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో ప్రభుత్వం దశాబ్దాల క్రితం జారీ చేసిన ఎన్టీఆర్ పట్టాలను క్రమబద్ధీకరిస్తోంది. లబ్ధిదారులకు కేవలం నివాస హక్కు కాకుండా పూర్తి యాజమాన్య హక్కులు కల్పించనుంది. ఈ ప్రక్రియలో సుమారు 617 ఎకరాల భూమిపై 24,057 కుటుంబాలకు హక్కులు లభించనున్నాయి. ఈ భూమి విలువ సుమారు రూ.9,800 కోట్లుగా ప్రభుత్వం అంచనా వేసింది. ఒక్కో కుటుంబానికి సగటున రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ఆస్తి విలువ ప్రయోజనం కలగనుందని అధికారులు చెబుతున్నారు. విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న కుటుంబాలకు ఈ నిర్ణయం ప్రత్యేకంగా ప్రయోజనం చేకూర్చనుంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తులో ఆస్తిపై పూర్తి హక్కులు కల్పించాలని కొండ ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఇళ్లకు సంబంధించిన పట్టాలు, యాజమాన్య హక్కులపై ఉన్న అనిశ్చితి తొలగిపోవడంతో ఆయా కుటుంబాలకు ఆస్తి భద్రత ఏర్పడనుంది. తరతరాలుగా నివాసం ఉంటున్న ప్రాంతాల్లో తమ ఇళ్లపై చట్టబద్ధమైన హక్కు లభించనుండటంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇటీవల నిర్వహించిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఇళ్ల పట్టాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాల సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ అంశంపై చర్యలు వేగవంతం చేసింది. **మిగులు 2వ పేజీలో....**

## కొత్త కరోనా కేసు లేదు

రాష్ట్రంలో యాక్టివ్ కేసులు సున్నా

94 రోజుల్లో 1,086 నమూనాల పరీక్ష..

78 మందికి పాజిటివ్

74 మంది పూర్తిగా కోలుకున్నారు

:మంత్రి సత్యకుమార్



**ఆంధ్రనాడు – అమరావతి, సెప్టెంబరు 26:** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ వ్యాప్తి ప్రస్తుతం పూర్తిగా అదుపులోకి వచ్చినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో గత 33 రోజులుగా ఒక్క కొత్త కరోనా కేసు కూడా నమోదు కాలేదని, ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య సున్నాకు చేరిందని శనివారం వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని వైద్యారోగ్య శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని ఆయన భరోసా ఇచ్చారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కరోనా పరీక్షల్లో ఒక్క పాజిటివ్ కేసు కూడా వెలుగు చూడలేదని మంత్రి తెలిపారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో యాక్టివ్ కరోనా కేసులు ఏవీ లేవని పేర్కొన్నారు. కరోనా వ్యాప్తిపై వైద్యారోగ్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు నిఘా కొనసాగిస్తున్నారని, పరీక్షలు, పర్యవేక్షణ వ్యవస్థలను కొనసాగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత మూడు నెలల గణాంకాలను పరిశీలిస్తే జూన్ 24 నుంచి సెప్టెంబరు 25 వరకు ది94 రోజుల వ్యవధిలో 1,086 కరోనా నమూనాలను పరీక్షించినట్లు మంత్రి వెల్లడించారు. వీటిలో కేవలం 78 మందికి మాత్రమే కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందన్నారు. పాజిటివ్‌గా తేలిన వారిలో 74 మంది ఇప్పటికే పూర్తిగా కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి అయినట్లు వివరించారు. అదే సమయంలో 94 రోజుల వ్యవధిలో ఏకంగా 66 రోజులు ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. **మిగులు 2వ పేజీలో....**

## జగన్‌ది ద్వంద్వ వైఖరి

:లావు శ్రీకృష్ణదేవరాయలు



ఎస్ఐఆర్‌పై ఇప్పుడు అభ్యంతరాలెందుకు?

స్థానిక ఎన్నికలపై గతంలో కోర్టును ఆశ్రయించింది వైసీపీనే

ఈసీ నియామక చట్టానికి మద్దతిచ్చి.. ఇప్పుడు సవరణ కోరడంపై ప్రశ్నలు

రాజకీయ ప్రయోజనాల కోసమే వైఖరి మారిందంటూ టీడీపీ ఎంపీ విమర్శలు

**ఆంధ్రనాడు, అమరావతి, సెప్టెంబరు 27:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విమర్శలు గుప్పించారు. ఎన్నికల ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంలో జగన్ వైఖరిలో మార్పు కనిపిస్తోందని ఆరోపించారు. రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఒకే అంశంపై భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రస్తుతం వైసీపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, గతంలో ఆ పార్టీ నాయకత్వం తీసుకున్న వైఖరిని లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తావించారు.వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెళ్ల అప్పిరెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను ఎస్ఐఆర్ పూర్తయిన తర్వాత నిర్వహించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. 2026 సెప్టెంబరు 1న ఈ పిటిషన్‌ను పెండింగ్‌లో ఉన్న స్థానిక ఎన్నికల సంబంధిత ప్రజా ప్రయోజన వ్యాజ్యాలతో కలిపి విచారించాలని హైకోర్టు నిర్ణయించింది. ఎస్ఐఆర్ పూర్తయి తుది ఓటర్ల జాబితా వెలువడిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని లెళ్ల అప్పిరెడ్డి తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. ఎస్ఐఆర్ సందర్భంగా మృతులు, డూప్లికేట్ ఓటర్లు, వలస వెళ్లినవారి పేర్లను గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ లావు శ్రీకృష్ణదేవరాయలు.. "అప్పుడు ఎస్ఐఆర్ పూర్తయిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోర్టును ఆశ్రయించి, ఇప్పుడు అదే ప్రక్రియపై ఆరోపణలు చేయడం వెనుక కారణం ఏమిటి?" అంటూ ప్రశ్నించారు. హైకోర్టు కూడా ఎస్ఐఆర్ కొనసాగుతున్న సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంపై ప్రశ్నలు లేవనెత్తింది. ఓటర్ల జాబితాలో మార్పులు జరుగుతున్న సమయంలో ఎన్నికలు నిర్వహిస్తే కొందరు ఓటు హక్కును కోల్పోయే **మిగులు 2వ పేజీలో....**

# ఈసీలో విభేదాల ప్రచారానికి తెర

మెదటి పేజీ తరువాయి....

### ముగ్గురు కమిషనర్ల భేటీ

ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ వార్తలు వెలువడిన నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫొటోను విడుదల చేయడంతో పాటు సంయుక్త ప్రకటన జారీ చేశారు. ఎన్నికల సంఘం అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలకు సంబంధించి వస్తున్న ఆరోపణలను ఈ ప్రకటనలో ఈసీ ఖండించింది. ఎన్నికల సంఘం తీసుకునే తుది నిర్ణయాలు సంస్థాగత విధివిధానాల ప్రకారమే ఉంటాయని, ఎస్ఐఆర్‌కు సంబంధించిన కీలక నిర్ణయాలు కూడా ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని స్పష్టం చేసింది

### 2025 జూన్ 24 ఆదేశాలు ఏకగ్రీవమే

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టేందుకు 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తెలిపింది. అనంతరం ఎస్ఐఆర్‌కు సంబంధించిన కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేసినట్లు పేర్కొంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తీసుకున్న నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నవి కావని, పూర్తి కమిషన్ సమష్టి నిర్ణయాలేనని ఈసీ స్పష్టం చేసింది. అలాగే ఎస్ఐఆర్‌లో భాగంగా ఫారం-6లో చేసిన మార్పులకు సుప్రీంకోర్టు సమర్థన లభించిందని కూడా కమిషన్ తన ప్రకటనలో పేర్కొంది.

### 14 అభ్యంతరాలపై వివాదం

ఈసీలో విభేదాల ప్రచారానికి ప్రధాన కారణంగా సెప్టెంబరు 23న వెలువడిన ఓ ప్రముఖ ఆంగ్ల పత్రిక కథనం నిలిచింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన పలు నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల వ్యవధిలో పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆ కథనం పేర్కొంది. భారత ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం, ఇద్దరు కమిషనర్లు వివిధ అంశాలపై కనీసం 14 సందర్భాల్లో అభిప్రాయాలు, అభ్యంతరాలను నమోదు చేశారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు--పునరుద్ధరణ, ఓటర్ల డేటా నిర్వహణ, ఫారం-6లో మార్పులు వంటి అంశాలు వాటిలో ఉన్నాయి. అయితే, ఈ అభిప్రాయాలు తుది నిర్ణయాలపై కమిషన్‌లో అధికారిక విభేదాలుగా పరిగణించలేమని ఈసీ స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలు, సూచనలు నిర్ణయ ప్రక్రియలో భాగమేనని, తుది నిర్ణయాలు మాత్రం పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్నవేనని పేర్కొంది.

### ఫారం-6 మార్పులపై అభ్యంతరాలు

కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన కొన్ని వివరాలను చేర్చడంపై కూడా అభ్యంతరాలు వ్యక్తమైనట్లు నివేదికలు వెలువడ్డాయి. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వ్యక్తి గతంలో జరిగిన ఎస్ఐఆర్‌లో తన పేరు లేదా తల్లిదండ్రులు/తాత, అమ్మమ్మల పేర్లు ఉన్నాయా అనే వివరాలకు సంబంధించిన ఎంపికలు చేయాల్సి వచ్చిందని నివేదికలు పేర్కొన్నాయి. ఈ మార్పులపై కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. అయితే ఈ అంశంలోనూ ఈసీ తుది నిర్ణయాలను ఏకగ్రీవంగానే తీసుకున్నామని చెబుతోంది.

### వివాదానికి రాజకీయ రంగు

ఈసీ అంతర్గత వ్యవహారాలపై వచ్చిన కథనాల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తాయి. ఓటర్ల జాబితా సవరణలో మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. మరోవైపు, ఈసీ మాత్రం అంతర్గతంగా అభిప్రాయాలు, సూచనలు ఉండటం సాధారణ నిర్ణయ ప్రక్రియలో భాగమేనని, తుది నిర్ణయాల్లో కమిషన్ ఏకాభిప్రాయంతోనే ముందుకు సాగిందని స్పష్టం చేసింది. దీంతో ఇప్పుడు ఈసీ జారీ చేసిన సంయుక్త ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ముగ్గురు కమిషనర్లు ఒకే వేదికపై సమావేశమై, సంస్థాగత నిర్ణయాలపై స్పష్టత ఇవ్వడం ద్వారా తమ మధ్య విభేదాలున్నాయనే ప్రచారానికి అధికారికంగా సమాధానం ఇచ్చినట్లయింది.

### ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకమే కీలకం

ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమని, రాజ్యాంగ సంస్థల పనితీరుపై వచ్చే ఆరోపణలు, సందేహాల విషయంలో అధికారిక వివరణలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తాజా పరిణామాలు మరోసారి చాటుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీ సంయుక్త ప్రకటనతో పాటు రాజకీయ నాయకుల స్పందనలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

భారీ వర్షాలతో

# ఉత్తరాంధ్ర అతలాకుతలం..

మెదటి పేజీ తరువాయి.... సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

### కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

### నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు. గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొత్త కరోనా కేసు లేదు

మెదటి పేజీ తరువాయి.... రాష్ట్రంలో ఎక్కడా కరోనా కేసులు ఒకేసారి పెద్ద సంఖ్యలో నమోదైన క్లస్టర్ల పరిస్థితి లేదని సత్యకుమార్ స్పష్టం చేశారు. స్థానికంగా కేసులు పెరుగుతున్నట్లు సూచించే పరిస్థితులు ప్రస్తుతం కనిపించడం లేదన్నారు. అయినప్పటికీ కరోనా సహా అంటువ్యాధుల విషయంలో వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. అవసరమైన పర్యవేక్షణ, పరీక్షల ప్రక్రియను కొనసాగిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో యాక్టివ్ కేసులు సున్నాకు చేరడం, వరుసగా 33 రోజుల పాటు కొత్త కేసులు నమోదు కాకపోవడం సానుకూల పరిణామమని వైద్యారోగ్య శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రజలు అనవసర ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి సత్యకుమార్ తెలిపారు. అయితే ప్రజారోగ్య పరంగా అప్రమత్తతను కొనసాగిస్తూ, వైద్య శాఖ సూచనలను పాటించడం ద్వారా వైరస్ వ్యాప్తికి అవకాశాలను మరింత తగ్గించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

# జగన్‌ది ద్వంద్వ వైఖరి

: లావు శ్రీకృష్ణదేవరాయలు

మెదటి పేజీ తరువాయి.... అవకాశం ఉందని కోర్టు పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థపై కూడా లావు శ్రీకృష్ణదేవరాయలు జగన్ ప్రస్తుత వైఖరిని ప్రశ్నించారు. 2023లో పార్లమెంట్ ఆమోదించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల నియామక చట్టం ప్రకారం నియామక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, కేంద్ర మంత్రివర్గ సభ్యుడు ఉంటారు. ఈ చట్టం ద్వారా సీజేఐ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చారు. ఆ సమయంలో వైసీపీ ఈ బిల్లుకు మద్దతు ఇచ్చిందని పార్లమెంటు చర్చలకు సంబంధించిన రికార్డులు, నివేదికలు సూచిస్తున్నాయి. రాజ్యసభ చర్చలో వైసీపీ సభ్యుడు సుభాష్ చంద్రబోస్ పిల్లి బిల్లుకు మద్దతుగా మాట్లాడినట్లు ఎన్డీటీవీ ప్రాఫిట్ నివేదించింది. అయితే తాజాగా జగన్ 2023 చట్టాన్ని పునఃపరిశీలించాలని, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, సీజేఐ ఉండే విధానాన్ని తిరిగి తీసుకురావాలని కోరారు. ఈ నేపథ్యంలోనే లావు శ్రీకృష్ణదేవరాయలు జగన్ వైఖరిని ప్రశ్నించారు. అప్పటి మద్దతుకు, ప్రస్తుత డిమాండ్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో న్యాయపరమైన సవాలు కొనసాగుతోంది. 2026 సెప్టెంబరు 23న ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఈ చట్టానికి సంబంధించిన పిటిషన్లపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ, తదుపరి విచారణ కోసం అంశాన్ని సీజేఐకి పంపేందుకు అంగీకరించింది. తగిన బలంతో కూడిన ధర్మాసనం ఏర్పాటు చేసే అంశాన్ని సీజేఐ పరిశీలించనున్నారు. ఇదే సమయంలో జగన్ 2023 చట్టాన్ని సవరించాలని కోరడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. చట్టానికి తమ పార్టీ గతంలో మద్దతు ఇచ్చిందని పేర్కొంటూనే, ప్రస్తుత పరిస్థితుల్లో దాన్ని తిరిగి పరిశీలించాల్సిన అవసరం ఉందని జగన్ తాజాగా తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో జగన్ వైఖరిలో మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందా అనే ప్రశ్నను లావు శ్రీకృష్ణదేవరాయలు లేవనెత్తారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తన మాతృ సంస్థగా పేర్కొంటున్న కాంగ్రెస్‌తో రాజకీయంగా దగ్గరవ్వాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరిలో మార్పులు చేస్తున్నారా అని ప్రశ్నించారు. అయితే కాంగ్రెస్‌తో భవిష్యత్ రాజకీయ పొత్తు లేదా కలయికపై జగన్ ఉద్దేశాన్ని నిర్ధారించే ఆధారం ఈ వ్యాఖ్యల్లో లేదు. ఇది లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన రాజకీయ ప్రశ్న, ఆరోపణగానే చూడాల్సి ఉంటుంది. మొత్తంగా ఎస్ఐఆర్, స్థానిక సంస్థల ఎన్నికలు, ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థ వంటి అంశాలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక చర్చకు దారితీస్తున్నాయి. ఒకే అంశంపై వివిధ సందర్భాల్లో రాజకీయ పార్టీల వైఖరులు ఎలా మారుతున్నాయన్న దానిపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు-ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి.

# వైఎస్సార్ విగ్రహం ఘటనపై టీడీపీ నేత దీపక్‌రెడ్డి ఫైర్

'పసుపు రంగుపై ఎందుకంత ఆగ్రహం?'
వైసీపీ నేతలు ఫేక్ ప్రచారం చేస్తున్నారంటూ ఆరోపణ
ఉమామహేశ్వరపురం ఘటనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఆంధ్రనాడు, మంగళగిరి, సెప్టెంబరు 26: ప్రకాశం జిల్లా ఉమామహేశ్వరపురంలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు రంగు పడిన ఘటనకు సంబంధించి వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి ఆరోపించారు. వైసీపీ అధినేత జగన్ హిందువులు, హిందూ సంప్రదాయాలను వ్యతిరేకించే ధోరణిలో ఉన్నారని ఆయన విమర్శించారు. శనివారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో దీపక్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్ విగ్రహంపై పసుపు పడిందనే కారణంతో ఓ టీడీపీ నాయకుడిని బెదిరించి, బలవంతంగా విగ్రహాన్ని నీటితో శుభ్రం చేయించి, ఆ దృశ్యాలను వీడియో తీసి ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉందని, అయితే ఒక వ్యక్తిని బెదిరించి ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదని అన్నారు.

### 'పసుపు అంటే ఎందుకంత వ్యతిరేకత?'

హిందూ సంప్రదాయాల్లో శుభకార్యాలకు పసుపుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని దీపక్‌రెడ్డి పేర్కొన్నారు. విగ్రహంపై పసుపు పడినట్లయితే చట్టప్రకారం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాల్సిందిపోయి, వ్యక్తులను బెదిరించడం, వీడియోలు తీసి ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ ఘటనను కేవలం ఓ టీడీపీ నాయకుడికి సంబంధించిన వివాదంగా చూడకుండా, చట్టపరమైన మార్గంలో పరిష్కరించాల్సిన అంశంగా చూడాలని ఆయన సూచించారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

### గత ఘటనలను ప్రస్తావించిన దీపక్‌రెడ్డి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆలయాలు, హిందూ ఆధ్యాత్మిక సంస్థలకు సంబంధించిన పలు వివాదాస్పద ఘటనలు చోటుచేసుకున్నాయని దీపక్‌రెడ్డి ఆరోపించారు. శ్రీశైలం నుంచి రామతీర్థం వరకు పలు దేవాలయాలకు సంబంధించి ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. అంతర్వేది రథం దగ్ధం, రామతీర్థంలో రాముడి విగ్రహం ధ్వంసం వంటి ఘటనలను ఆయన ప్రస్తావించారు. ఆయా ఘటనల్లో బాధ్యులపై చర్యలు తీసుకునే విషయంలో అప్పటి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అయితే ఈ ఘటనలపై అప్పటి ప్రభుత్వ వైఖరి, దర్యాప్తు, కేసుల పురోగతిపై వేర్వేరు అధికారిక రికార్డులు, దర్యాప్తు వివరాలను పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంటూ ఆయన రాజకీయ విమర్శలు చేశారు.

### తిరుమల అంశాలపైనా విమర్శలు

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు సంబంధించిన పలు అంశాలను కూడా దీపక్‌రెడ్డి తన ప్రసంగంలో ప్రస్తావించారు. బస్సు టికెట్లపై అన్యమత ప్రచార వాక్యాలు, టీటీడీ వెబ్‌సైట్‌కు సంబంధించిన వివాదాలు, పరకామణిలో జరిగిన చోరీ తదితర అంశాలపై ఆయన వైసీపీ నాయకత్వాన్ని విమర్శించారు. తిరుమల వంటి పవిత్ర పుణ్యక్షేత్రానికి సంబంధించిన వ్యవహారాల్లో మరింత జాగ్రత్త, పారదర్శకత అవసరమని అన్నారు. భక్తుల మనోభావాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

### 'వైఖరి మార్చుకోవాలి'

వైసీపీ నాయకులు ఇప్పటికైనా తమ రాజకీయ విధానాన్ని మార్చుకోవాలని దీపక్‌రెడ్డి సూచించారు. ప్రజల మతపరమైన, ఆధ్యాత్మిక విశ్వాసాలకు సంబంధించిన అంశాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఉమామహేశ్వరపురం ఘటనకు సంబంధించి నిజానిజాలు అధికారికంగా వెలుగులోకి రావాల్సి ఉండగా, ఇరుపక్షాల ఆరోపణలు రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి.

# శ్రీవారి రూ.300 టికెట్లపై టీటీడీ వివరణ



ఆంధ్రనాడు, తిరుమల, సెప్టెంబర్ 26 : శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌పై భక్తుల నుంచి వస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ సాంకేతికంగా అత్యంత పటిష్ఠంగా ఉందని, అయితే అందుబాటులో ఉన్న టికెట్ల కోటాకు మించి దాదాపు 9 రెట్లు అధికంగా డిమాండ్ ఉండటమే సమస్యకు ప్రధాన కారణమని స్పష్టం చేసింది. క్షణాల్లో టికెట్లు అయిపోవడాన్ని వ్యవస్థ వైఫల్యంగా భావించ వద్దని భక్తులకు విజ్ఞప్తి చేసింది. టికెట్ల విడుదల సమయంలో వాస్తవంగా ఏం జరుగుతుందో టీటీడీ గణాంకాలతో సహా వివరించింది. దర్శన టికెట్ల బుకింగ్ కోసం ఒకేసారి సుమారు 6 లక్షల మంది యూజర్లు వెబ్‌సైట్‌లోకి వస్తున్నారని తెలిపింది. ఒక్కో యూజర్ సగటున తమ కుటుంబ సభ్యుల కోసం నాలుగు టికెట్లకు ప్రయత్నించినా, మొత్తం డిమాండ్ సుమారు 24 లక్షల టికెట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. అయితే, టీటీడీ విడుదల చేసే కోటా కేవలం 2.69 లక్షల టికెట్లు మాత్రమే. అంటే, అందుబాటులో ఉన్న ప్రతి టికెట్‌కు సగటున 9 మంది పోటీ పడుతున్నారని, ఈ తీవ్రమైన పోటీ కారణంగానే చాలా మందికి టికెట్లు లభించడం లేదని పేర్కొంది. బుకింగ్ సమయంలో భక్తులను కొంతసేపు నిరీక్షించేలా చేసే 'వర్చువల్ క్యూ' విధానంపై కూడా టీటీడీ స్పష్టత ఇచ్చింది. ఇది టికెట్లను నిరాకరించడానికి కాదని, ఒకేసారి లక్షలాది అభ్యర్థనలు వచ్చి సర్వర్లపై భారం పడకుండా, మొత్తం వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడేందుకు ఏర్పాటు చేసిన సాంకేతిక విధానమని తెలిపింది. గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్, ఆటో స్కేలింగ్, లోడ్ బ్యాలెన్సింగ్ వంటి ఆధునిక టెక్నాలజీతో ఆన్‌లైన్ వ్యవస్థను నిర్వహిస్తున్నామని, ప్రత్యేక టెక్నికల్ వార్-రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించింది. అదేవిధంగా, పేమెంట్ విఫలమవడం పూర్తిగా టీటీడీ పరిధిలోని అంశం కాదని, ఇది పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకులు, యూపీఐ నెట్‌వర్క్‌ల పనితీరుపై కూడా ఆధారపడి ఉంటుందని గుర్తుచేసింది. టికెట్లు అందుబాటులో లేకపోవడం వల్ల వచ్చే 'స్లాట్ అన్‌అవైలబుల్' సందేశాన్ని సాంకేతిక లోపంగా పరిగణించరాదని కోరింది. శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వంటి ఇతర ఆలయాల బుకింగ్ ప్రక్రియ ఇదే వ్యవస్థ ద్వారా సజావుగా సాగుతోందని, అక్కడ డిమాండ్ తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని ఉదహరించింది. భక్తుల ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని, యాంటీ-బాట్ మెకానిజమ్స్, సెక్యూరిటీ, పేమెంట్ ప్రక్రియలను నిరంతరం మెరుగుపరుస్తున్నామని టీటీడీ హామీ ఇచ్చింది. భారీ డిమాండ్ ఉన్నప్పుడు ప్రతి ఒక్కరికీ టికెట్ లభించడం సాధ్యం కాదని, ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని కోరింది. టీటీడీపై సోషల్ మీడియాలో జరిగే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, భక్తులకు పారదర్శకమైన, సురక్షితమైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

సోషల్ మీడియా

# ఫిర్యాదుపై పవన్ కల్యాణ్ స్పందన

మెదటి పేజీ తరువాయి.... పరిశ్రమల ప్రాంగణాల్లోనే వర్షపు నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని, కలుషిత నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు విడుదల చేయరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణ ప్రక్రియను డిజిటలైజ్ చేయాలని సూచించింది. పరిశ్రమల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు తేదీ, సమయంతో కూడిన రికార్డింగ్ సదుపాయం ఉన్న సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వాటి ఫుటేజీని కనీసం ఆరు నెలల పాటు భద్రపరచాలని ఆదేశించింది. అదేవిధంగా ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వినియోగించాలని, పర్యావరణ అనుమతుల్లో పేర్కొన్న నిబంధనలు, కాలుష్య నియంత్రణ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని పీసీబీ స్పష్టం చేసింది. ఏడు రోజుల గడువులో సంతృప్తికరమైన వివరణ ఇవ్వని పరిశ్రమలపై, లేదా అక్రమంగా వ్యర్థ జలాలను విడుదల చేస్తున్నట్లు దర్యాప్తులో తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. అవసరమైతే తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు కాలుష్య నియంత్రణకు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరవాడ ఫార్మాసిటీ వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో పర్యావరణ ప్రమాణాల అమలుపై నిరంతర పర్యవేక్షణ అవసరమనే అంశాన్ని ఈ ఘటన మరోసారి తెరపైకి తెచ్చింది. సోషల్ మీడియాలో వెలువడిన ఫిర్యాదుపై ప్రభుత్వం వేగంగా స్పందించి తనిఖీలు చేపట్టడం, అనంతరం 95 పరిశ్రమలకు నోటీసులు జారీ చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పీసీబీ చేపట్టిన తదుపరి విచారణలో కాలుష్యానికి అసలు కారణాలు, బాధ్యులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఉగ్రవాదానికి

# కేరాఫ్ పాకిస్థాన్..

మెదటి పేజీ తరువాయి.... ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 : ఐక్యరాజ్యసమితి (ఐరాస) సాధారణ సభ వేదికగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య మరోసారి మాటల యుద్ధం చోటుచేసుకుంది. పాకిస్థాన్ 'నిరంతర ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే దేశం' అని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిన్న 81వ ఐరాస సాధారణ సభలో ఆయన ప్రసంగిస్తూ, అంతకుముందు రోజు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రసంగంలోని వాస్తవాలను వక్రీకరించారని దుయ్యబట్టారు. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. "నిన్న, ఉగ్రవాదాన్ని అలవాటుగా మార్చుకున్న ఒక దేశం ఈ సభ ముందు వాస్తవాలను వక్రీకరించింది. ఉగ్రవాదాన్ని సాధారణీకరించేందుకు, దాని పరిణామాల నుంచి తప్పించుకోవడానికి వాదనలు వినిపించింది. అది కుదరదు. ఉగ్రవాదం నుంచి మమ్మల్ని మేము రక్షించుకునే హక్కును వినియోగించుకుంటాం. ఉగ్రవాదం, స్నేహం కలిసి కొనసాగలేవు" అని జైశంకర్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారే తమ పద్ధతులు మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. శుక్రవారం తన ప్రసంగంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. గత ఏడాది మే నెలలో భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'ను 'తప్పుడు సాకుతో చేసిన బాహ్య దురాక్రమణ'గా అభివర్ణించారు. ఐరాస చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం తమ సైన్యం ఆత్మరక్షణ కోసమే ప్రతిదాడి చేసిందని, శత్రువుకు ఎప్పటికీ మరిచిపోలేని గుణపాఠం చెప్పిందని పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను, సైన్యాన్ని ప్రశంసించారు. ఆపరేషన్‌ను నిలిపివేయడంలో సకాలంలో జోక్యం చేసుకున్నందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత ట్రంప్ కూడా ఈ ప్రసంగంలోని 87 సెకన్ల క్లిప్‌ను ఎలాంటి వ్యాఖ్య లేకుండా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పంచుకున్నారు. అయితే, పాక్ వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. గత ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మంది పౌరుల మరణానికి కారణమైన ఉగ్రదాడికి ప్రతీకారంగానే, మే 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించినట్లు భారత్ గుర్తుచేసింది. ట్రంప్ జోక్యం వల్లే ఆపరేషన్ ఆగిందన్న వాదనలో నిజం లేదని, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) తమ భారత ప్రతిరూపానికి చేసిన అభ్యర్థన మేరకే ఆపరేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు న్యూఢిల్లీ స్పష్టం చేసింది.

భద్రతా మండలిలో

# శాశ్వత సభ్యత్వం..

మెదటి పేజీ తరువాయి.... భద్రతా మండలిని ప్రస్తుత రాజకీయ వాస్తవాలకు అనుగుణంగా విస్తరించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. సమావేశాల సందర్భంగా పోర్చుగల్ ప్రధాని లూయిస్ మోంటెనెగ్రో మాట్లాడుతూ, భద్రతా మండలిలో ప్రాతినిధ్యం పెరగాలని, ఆఫ్రికా, బ్రెజిల్, భారత్‌లకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని పిలుపునిచ్చారు. మారిషస్ విదేశాంగ మంత్రి ధనంజయ్ రామ్‌ఫుల్ అత్యంత స్పష్టమైన మద్దతును ప్రకటించారు. "ప్రపంచ వ్యవహారాల్లో భారత్ పోషిస్తున్న నిర్మాణాత్మక పాత్రకు అనుగుణంగా, శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశ అభ్యర్థిత్వాన్ని మేం సమర్థిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. జీ4, ఎల్69 గ్రూపుల వాదనలకు కూడా తమ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. భారత్, బ్రెజిల్, జర్మనీ, జపాన్‌లతో కూడిన జీ4 కూటమికి కూడా మద్దతు లభించింది. మార్షల్ ఐలాండ్స్ అధ్యక్షురాలు హిల్డా హీన్ మాట్లాడుతూ, "భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం జపాన్, దాని జీ4 భాగస్వాములకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని ప్రకటించారు. దీని ద్వారా ఆమె పరోక్షంగా భారత్‌కు మద్దతు పలికినట్టయింది. ఈ సమావేశాల్లో ఆఫ్రికా దేశాల నుంచి సంస్కరణల కోసం అత్యంత బలమైన గళం వినిపించింది. సియెర్రా లియోన్ అధ్యక్షుడు జూలియస్ మాదా బయో మాట్లాడుతూ, "భద్రతా మండలి ఇప్పటికీ 1945 నాటి ప్రపంచాన్ని ప్రతిబింబిస్తోంది. 160 కోట్లకు పైగా జనాభా ఉన్న ఆఫ్రికాకు ఇప్పటికీ శాశ్వత స్థానం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమానీ మహామ మాట్లాడుతూ, "భద్రతా మండలి సంస్కరణ అనేది ఆఫ్రికాకు చేసే మేలు కాదు.. ఐరాస విశ్వసనీయత, మనుగడకు ఇది అత్యవసరం" అని అన్నారు. అయితే, భద్రతా మండలి సంస్కరణలు జరగాలన్న దానిపై విస్తృత ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ, ఏ దేశాలకు అవకాశం ఇవ్వాలి, ప్రాంతీయ కేటాయింపులు, ముఖ్యంగా వీటో అధికారంపై భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, అమెరికా శాశ్వత సభ్యులుగా ఉన్న ఈ మండలి కూర్పును మార్చాలంటే, సర్వసభ్య సభలో మూడింట రెండొంతుల సభ్యుల ఆమోదంతో పాటు, ఐదు శాశ్వత సభ్య దేశాలు కూడా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ కారణాల వల్లే సంస్కరణల ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

# 10 శాతం వృద్ధి సాధ్యమే

మెదటి పేజీ తరువాయి.... ఈ రంగాల్లో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు రంగం కూడా భారీగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కొన్ని ప్రత్యేక రంగాలకు మాత్రమే పరిమితం కాకుండా వ్యవసాయం, తయారీ, సేవలు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక సేవలు తదితర అన్ని రంగాల్లోకి విస్తరించాలని కేంద్ర మంత్రి సూచించారు. డిజిటల్ వ్యవస్థల వినియోగం పెరిగిన కొద్దీ ఉత్పాదకత, సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ తదుపరి దశకు చేరుకోవాలంటే సాంకేతిక ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ సేవల నుంచి పరిశ్రమల కార్యకలాపాల వరకు డిజిటల్ విధానాలను విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. కొత్త సాంకేతికతల ఆధారంగా మరిన్ని అంకుర సంస్థలు (స్టార్టప్‌లు) ఏర్పడాల్సిన అవసరం ఉందని నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. యువత కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చి సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాల్లో దేశీయ సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు ప్రపంచ సాంకేతిక మార్కెట్లో భారత్ పాత్రను మరింత విస్తరించుకునే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఏఐ వినియోగం కేవలం పెద్ద కార్పొరేట్ సంస్థలకే పరిమితం కాకూడదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్న, మధ్య తరహా సంస్థలు ఏఐ ఆధారిత పరిష్కారాలను ఉపయోగించడం ద్వారా తమ ఉత్పాదకత, నిర్వహణ సామర్థ్యం, మార్కెట్ పరిధిని పెంచుకునే అవకాశాలు ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వాటిని వినియోగించే మానవ వనరులను సిద్ధం చేయడం కూడా అంతే ముఖ్యమని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలు సులభంగా అర్థం చేసుకుని తమ వృత్తి, వ్యాపార కార్యకలాపాల్లో ఉపయోగించుకునేలా శిక్షణా వ్యవస్థలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్ ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని వివరించారు. దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో తదుపరి దశకు చేరుకోవాలంటే డిజిటల్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం, పెట్టుబడులు, నైపుణ్యాలు అందుబాటులోకి వస్తే దేశ భవిష్యత్ ఆర్థిక సామర్థ్యాన్ని మరింత పెంచుకోవచ్చని ఆమె అన్నారు. 10 శాతం దాటే ఆర్థిక వృద్ధి లక్ష్యానికి సాంకేతికత, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ మౌలిక వసతులు కీలకమైన అంశాలుగా నిలుస్తాయని నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# విజయవాడ పేదలకుపట్టాభిషేకం...!

మెదటి పేజీ తరువాయి.... ప్రస్తుతం 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్ధిదారులకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియ చేపట్టింది. క్రమబద్ధీకరణకు ఎంపిక చేసిన భూముల మార్కెట్ విలువ దాదాపు రూ.24,297 కోట్లు ఉంటుందని అంచనా. ఈ పట్టాల పంపిణీతో ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లాలోని గన్నవరం నియోజకవర్గం కలిపి మొత్తం 8 నియోజకవర్గాల పరిధిలోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. వేలాది కుటుంబాలకు ఆస్తిపై సంపూర్ణ హక్కులు లభించడంతో పాటు భవిష్యత్తులో ఆస్తి లావాదేవీలు, వారసత్వ హక్కులు తదితర అంశాల్లో స్పష్టత ఏర్పడే అవకాశం ఉంది. పట్టాలు పొందనున్న 24,057 కుటుంబాల్లో వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు ఉన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాల సమస్యకు పరిష్కారం చూపుతూ, పేదలకు కేవలం నివాసం కాకుండా సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ నెల 30న జరిగే పట్టాల పంపిణీ కార్యక్రమంతో వేలాది కుటుంబాల చిరకాల నిరీక్షణకు తెరపడనుంది.

హథీరాంజీ మఠం భూములపై ప్రభుత్వం

# స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్

**తిరుపతి, ఆంధ్రనాడు, సెప్టెంబర్ 26:** తిరుపతి అవిలాల భూముల వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవాదాయ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా కలెక్టర్ చేపట్టిన చర్యలను స్వాగతిస్తున్నామని, అయితే ఒకే సర్వే నంబర్లలో కోచి కుటుంబ వాటాతో పాటు శ్రీ స్వామి హథీరాంజీ మఠం వాటా కూడా ఉన్నందున, రెండు వాటాల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని తిరుపతి శ్రీ హథీరాం బావాజీ ఆలయ ట్రస్ట్ చైర్మెన్ భూక్య శివా నాయక్, వెంకట రమణ నాయక్ తో కలిసి తిరుపతి ప్రెస్ క్లబ్ లో శనివారం విలేఖర్ల సమావేశంలో కోరారు. శివా నాయక్ మాట్లాడుతూ కోచి శేషగిరిరావు కుటుంబ వాటాకు సంబంధించిన చర్యలు చేపట్టే సమయంలో, హథీరాంజీ మఠానికి చెందాల్సిన భూముల పరిరక్షణ, ఆక్రమణల గుర్తింపు, న్యాయ స్థానాల ఉత్తర్వుల అమలుకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అవిలాల గ్రామంలోని సర్వే నంబర్లు 13, 15/2, 17/2, 17/3, 17/5లో మొత్తం 172.88 ఎకరాలకు తాత్కాలిక విభజన రూపొందించారు. ఇందులో కోచి కుటుంబానికి



86.44 ఎకరాలు, హథీరాంజీ మఠానికి 86.44 ఎకరాల చొప్పున ప్రతిపాదించారని, 23-09-2026 తేదీతో దేవాదాయ కమిషనర్‌కు ఉద్దేశించి రూపొందించిన కోచి శేషగిరిరావు ప్రతినిధి పత్రంలో, తన కుటుంబ వాటాకు తుది సర్వే, హద్దుల నిర్ధారణ, సెక్షన్ 22-ఏ (1)(సి) నిషేధిత జాబితా నుంచి చట్టబద్ధమైన మినహాయింపు, ఆక్రమణలపై చర్యలను కోరారని, ఈ అభ్యర్థనపై నిర్ణయం తీసుకునే సమయంలో, అదే సర్వే నంబర్లలోని మఠం వాటాపై కూడా తుది నిర్ణయం తీసుకోవాల ని శివ నాయక్ కోరారు. కలెక్టర్ నివేదికను దేవాదాయ శాఖ వెంటనే పరిశీలించి, సంబంధిత న్యాయస్థాన ఉత్తర్వుల పరిధిని నిర్ధారించి, రెండు వాటాలకు సంబంధించిన తుది సర్వే, హద్దుల గుర్తింపు, ఆక్రమణల పరిశీలనకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ముఖ్యంగా, మఠానికి చెందినట్లు చట్టబద్ధంగా నిర్ధారించిన భూములలో ఆక్రమణలు ఉన్నట్లయితే, సంబంధిత అధికారుల ద్వారా తగిన నోటీసులు జారీచేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాల ని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సెప్టెంబర్ 25 నాటి సుప్రీంకోర్టు కేస్ స్టేటస్ చిత్రంలో పిటిషన్లు కొట్టివేయబడినట్లు ఉంది. పూర్తి ఉత్తర్వుల ప్రతిని ధృవీకరించే వరకు ఆ తీర్పు నిర్దిష్ట భూములను ఖాళీ చేయించాల ని ఆదేశించినట్లు పేర్కొనరాదని, అలాగే సెప్టెంబర్ 20 నాటి కలెక్టర్ నివేదికను తుది భూముల అప్పగింత ఉత్తర్వుగా పరిగణించరాదని శివా నాయక్ కోరారు.

పెరటాసి మాసం 2 వ శనివారం

# భక్తి పారవశ్యంలో నగర సంకీర్తన

**తిరుపతి, ఆంధ్రనాడు, సెప్టెంబర్ 26:** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరం పెరటాసి మాసం 2వ శనివారం సందర్భంగా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. శ్రీ మహావిష్ణువుకు, ముఖ్యంగా కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారికి అత్యంత ప్రీతికరమైన పెరటాసి మాసం ప్రారంభం కావడంతో నగర సంకీర్తనకు ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఈ పవిత్ర మాసంలో వచ్చే ఐదు శనివారాలు గోవింద నామస్మరణ, భజనలు, నగర సంకీర్తనలో పాల్గొంటే స్వామివారి అనుగ్రహం, ఆయురా రోగ్యాలు, ఐశ్వర్యం, సర్వమంగళాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో తిరుపతి నగరంలో నిర్వహించి న నగర సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శనివారం తెల్లవారుజామున బ్రహ్మముహూర్తానికే భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో, నుదుటిపై గోవింద నామాలతో గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఉదయం ఐదు గంటలకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, శ్రీహరి నామస్మరణల నడుమ నగర సంకీర్తన ఘనంగా ప్రారంభమైంది. "గోవింద...



గోవింద..." నామస్మరణతో తిరుపతి వీధులన్నీ మారుమోగాయి. పెరటాసి మాసం 2వ శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషంగా కనిపించింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తులు భజనలు చేస్తూ నగర వీధుల్లో ఆధ్యాత్మిక సందేశాన్ని చాటారు. ఈ పవిత్ర మాసంలో వచ్చే ప్రతి శనివారం నగర సంకీర్తనలో పాల్గొని శ్రీ వేంకటేశ్వర స్వామిని స్మరించడం ద్వారా కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మిక శాంతి, సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఇంటా గోవింద నామం మారుమోగాలని, సమాజంలో భక్తి, సేవాభావం, ఐక్యత పెంపొందాలని సంకల్పంతో నగర సంకీర్తనను నిరంతరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. సంకీర్తన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ముగించారు. ఈ కార్యక్రమంలో , ప్రవచనకర్త చంద్రమౌళి, మునెప్పగారి మునినాథరెడ్డి, రిటైర్డ్ టీచర్ విజయ్ భాస్కర్ రెడ్డి , కత్తుల కిషోర్ రాయల్, తొండమునాటి దశరథ రెడ్డి, కృష్ణంరాజు, గుండాల గోపీనాథ్, , కుప్పం రవిశంకర్ యాదవ్, పురుషోత్తం యాదవ్, మురళి, మేకల గంగయ్య, కొండేచంగారెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, , వాసుదేవరెడ్డి, అరుణమ్మ, జయమ్మ, విజయకుమారి, శ్రావణి, అమరావతి, పావని, ఉష్శ్రీ, రేవతి, ఉమాజీ, పద్మ, వై. పద్మావతి, సిద్ధమ్మ, ధనమ్మ, కల్పన, నాగరాజమ్మ, పద్మావతి, కళ్యాణి, సుశీలమ్మతో పాటు నగర సంకీర్తన మండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని అందించి

# స్థానిక సంస్థ ఎన్నికలకు వెళ్తున్నాం..

**కూటమి పార్టీలు ఐక్యంగా పోటీ చేస్తాయి**
**అన్ని స్థానాలు గెలుస్తాం**
**జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**ఆంధ్రనాడు, చిత్తూరు, సెప్టెంబర్ 26:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గత రెండున్నర సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించి స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజల ముందుకు వెళ్తున్నామని జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. శనివారం చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో.. చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇన్చార్జి కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, జనసేన ఎమ్మెల్యే ధర్మరాజు, జిల్లా తెదేపా అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి, భాజపా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, ఇతర ముఖ్య కూటమి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా



మంత్రి మాట్లాడుతూ.. 2024 సాధారణ ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలో ఏడు స్థానాల్లో కూటమి పార్టీ గెలిచిందని, ఇదే తరహాలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు ఐక్యమత్యంగా పోటీ చేసి వందశాతం విజయాలు సాధిస్తామన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాట్లపై చర్చించామని, తుది నిర్ణయం అధిష్టానం తీసుకుంటుందన్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పని చేస్తామన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయక.. దొడ్డిదారిన ఎన్నికలు నిర్వహించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నామని, రాజ్యాంగబద్ధంగా ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మరోవైపు వైకాపా ప్రజల పక్షాన ఏనాడు పోరాటం చేయలేదని, ప్రతిపక్ష పాత్ర పోషించలేదని విమర్శించారు. ఒక్కరోజు అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యల ప్రస్తావించలేదన్నారు. ఇప్పుడు స్థానిక ఎన్నికల కోసం డ్రామాలు ఆడుతున్నారని, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి గారికి బహుమతిగా అందిస్తామని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సజీవ వారసత్వాన్ని

# సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ మెంబర్**
**మెంబర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్**
**ఎస్వీయూలో జీవ వైవిధ్యంపై వారం రోజుల**
**పాటు కార్యక్రమాలు ప్రారంభం**

**ఆంధ్రనాడు, తిరుపతి, సెప్టెంబర్ 26 :** దేశంలో నెలకొన్న జీవవైవిధ్య సజీవ వారసత్వాన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ సభ్యులు చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, విద్యార్థి సంక్షేమ మరియు సాంస్కృతిక వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని "శేషాచలం - జీవ వైవిధ్య సజీవ వారసత్వం" అనే అంశంపై వారం రోజుల అవగాహన, సృజనాత్మక కార్యక్రమాలు ఎస్వీయూ సెనేట్ హాల్లో శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ సభ్యుల చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్, ఉపకులపతి ఆచార్య టి. నర్సింగరావు, కులసచివులు ఆచార్య ఎం. భూపతి నాయుడు, రెక్టార్ ఆచార్య చంద్రాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్, మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం పరిధిలో అన్ని డిగ్రీ కళాశాలలు, వర్సిటీ కళాశాలలో విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు జీవవైవిధ్యం, సంస్కృతి, సాంప్రదాయాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను విద్యార్థి కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. విద్యార్థులు జీవవైవిధ్యంపై ప్రత్యేకమైన అవగాహనతో వాటిని సంరక్షించేందుకు తమ వంతు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. ఆచార్య ఎం. భూపతి నాయుడు మాట్లాడు




తూ విద్యార్థులు అడవుల సంరక్షణ వలన కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకొని, జీవవైవిధ్య రంగం ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. మొక్కలను నాటుతూ, సంరక్షిస్తూ అటవి సంపద పెంచడం ద్వారా వర్షాలు పుష్కలంగా కురిసి ప్రజలకు ఎలాంటి సహజ వనరుల కొరత లేకుండా పోతుందన్నారు. సమాజంలో నివసించే ప్రతి ఒక్కరూ ముఖ్యంగా విద్యార్థులు సమావేశంలో భాగంగా మొక్కలను నాటుతూ వాటిని సంరక్షించవలసిన బాధ్యత కూడా స్వీకరించాలని సూచించారు. డిఎస్డబ్ల్యూసిఏ డైరెక్టర్ ఆచార్య బివి. మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు జీవవైవిధ్యం, వన్య ప్రాణాల సంరక్షణ విధానం, వాటి ఆవశ్యకత గురించి వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలను ఎస్వీయూ సెనేట్ హాల్, శ్రీనివాస ఆడిటోరియం, అన్నమయ్య భవనంలలో డిగ్రీ కళాశాల, వర్సిటీ కళాశాల విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. డిఎస్డబ్ల్యూసిఏ అసిస్టెంట్ డైరెక్టర్, కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలు, కలలు, సాహిత్యం వంటి రంగాలలో పాటు జీవవైవిధ్య సదస్సు నిర్వహించడం ద్వారా వారిలో ప్రత్యేకమైన అవగాహన ఏర్పరిచేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ మెంబర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్ ను పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

**వారం రోజులు పాటు జరిగే కార్యక్రమాల :**

26 సెప్టెంబర్ - చిత్రలేఖన పోటీ - "శేషాచలం కొండలు - జీవ వైవిధ్య నిధి"
27 సెప్టెంబర్ - జీవ వైవిధ్య నడక - "ప్రకృతి కోసం నడుద్దాం - శేషాచలం కోసం నడుద్దాం"
28 సెప్టెంబర్ - వక్తృత్వ పోటీ - "శేషాచలం కొండలు: మన జీవ వైవిధ్య వారసత్వం మరియు మన బాధ్యత"
29 సెప్టెంబర్ - మొక్కల పంపిణీ - "ఈరోజు నాటండి - రేపటిని కాపాడండి"
30 సెప్టెంబర్ - ఛాయాచిత్ర ప్రదర్శన - "ప్రకృతి కటాక్షంలో"
1 అక్టోబర్ - సదస్సు - "శేషాచలం: జీవ వైవిధ్య సజీవ వారసత్వం"
2 అక్టోబర్ - మొక్కలు నాటడం, హరిత ప్రాంగణ కార్యక్రమం - "ఒక మొక్క నాటండి - జీవాన్ని పెంచండి - భవిష్యత్తును కాపాడండి" వంటి కార్యక్రమాలు వారం రోజులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, ప్రిన్సిపాల్ లు, పరిశోధకులు, వర్సిటీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు, డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# హెచ్ఐవీపై అవగాహనకు 5కె రెడ్ రన్

**యువతకు ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన**

**ఆంధ్రనాడు - తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 26:** హెచ్ఐవీ /ఎయిడ్స్ నివారణపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు తిరుపతిలో శుక్రవారం 5కె రెడ్ రన్ మారథాన్ నిర్వహించారు. ఇంటెన్సిఫైడ్ ఐఈసీ కార్యక్రమంలో భాగంగా దిశ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి కంట్రోల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. బాలకృష్ణ నాయక్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి కంట్రోల్ అధికారి డా. పి. శైలజ జెండా ఊపి 5కె రెడ్ రన్ ను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనం తరం ఎస్వీ జూనియర్ కళాశాలలో హెచ్ఐవీ / ఎయిడ్స్‌పై అవగా హన క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డా. బాలకృష్ణ నాయక్, డా. పి. శైలజ విద్యార్థులకు హెచ్ఐవీ వ్యాప్తికి కారణాలు, నివారణ మార్గాలు, అపోహలు-వాస్తవా లు, హెచ్ఐవీ పరీక్షలు,



చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పిం చారు. యువతలో హెచ్ఐవీపై సరైన అవగాహన పెంపొందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని డా. బాలకృష్ణ నాయక్ తెలిపారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా సామాజికంగా అండగా నిలవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, హెచ్ఐవీ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. క్విజ్ పోటీల్లో విజేతలకు డీఎంహెచ్‌వో డా. బాలకృష్ణ నాయక్ మెరిట్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్ బాబు, అధ్యాపకులు, సిబ్బంది, దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ కోట రెడ్డి, సిబ్బంది సురేంద్ర, మంజునాథ్, పుల్లయ్య, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు

శిల్పారామంలో నేడు

# ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు



**ఆంధ్రనాడు - తిరుచానూరు, సెప్టెంబరు 26:** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తిరుపతి శిల్పారామంలో ప్రత్యేక వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఏపీ టూరిజం అధికారులు తెలిపారు. సెప్టెంబరు 27న సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, జాయింట్ కలెక్టర్‌తో పాటు పర్యాటక, సాంస్కృతిక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించనున్నారు. పర్యాటక ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు రాష్ట్ర సాంస్కృతిక వైభవం, కళలు, సంప్రదాయాలను పరిచయం చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు, ఇతర ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇవి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తిరుపతి నగర ప్రజలు, పర్యాటకులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని అధికారులు కోరారు. ఈ మేరకు ఏపీటీడీసీ రీజినల్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి జనార్ధన్ రెడ్డి, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఖాదర్ వల్లి ప్రజలకు ఆహ్వానం పలికారు.

# ఉపాధ్యాయులకు గడువు ఇవ్వండి..

**వైఎస్ఆర్టీఏ డిమాండ్**



**ఆంధ్రనాడు, చిత్తూరు, సెప్టెంబర్ 26:** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు నిధి పోర్టల్ నందు సేవా రిజిస్టర్ ( ఎస్ ఆర్ ) నమోదుకు గడువు ఇవ్వాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వీ రెడ్డి శేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల ముప్పైయోవ తేదీ లోపు ఉద్యోగులందరూ తమ సేవా రిజిస్టర్ ను అప్లోడ్ చేయాలనీ ఆర్థిక శాఖ ఆదేశించిందని అయితే రాబోవు ఇరవై రోజులతో పాటు పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నికలు, ఎఫ్ ఏ రెండు పరీక్షల నిర్వహణ మరియు టెట్ పరీక్షలకు హాజరు తదితర పనులు ఉన్నందున ఉపాధ్యాయులకు వీలు పడదని తెలిపారు. ఆర్థిక శాఖ నిధిపోర్టల్లో వివిధ అంశాలు నమోదు కష్టతరంగా ఉందని విమర్శించారు. సీనియర్ ఉపాధ్యాయులకు మ్యారేజ్ సర్టిఫికెట్ లేవని వారు ఎలా అప్లోడ్ చేస్తారని మండిపడ్డారు. నిబంధనలు సవరించి ప్రతి ఉద్యోగికి వారి ఆఫీసులోనే ఈఎస్ఆర్ నమోదుకు డ్రాయింగ్ అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని, ఆర్థికశాఖ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాజనాలబండ

# పై అలరించిన రామకోటి



**ఆంధ్రనాడు, చౌడేపల్లి, సెప్టెంబర్ 26:** సత్య ప్రమాణాలకు నిలయమైనా రాజనాలబండ పై శనివారం నిర్వహించిన రామకోటి భక్తులను అలరించింది మైక్ సెట్ రమణ ఆధ్వర్యంలో భక్తులందరూ కలుసుకొని రామకోటి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు ఉదయం నుంచి 24 గంటలపాటు రామకోటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయాన్నే స్వామివారికి విశేష అభిషేకము అలంకరణ నిర్వహించారు. పలువురు సత్య ప్రమాణాలు చేశారు మరికొందరు వాయిదా వేసుకుని వెళ్లారు. శ్రీరామ జయరామ జై జై రామ జానకిరామ దశరథ రామ అనే రామనామ స్మరణతో ఆ ప్రాంతం దద్దరిల్లింది చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి రామకోటిని తిలకించారు అందరికీ ఉచిత భోజన వసతి కల్పించారు.

సుఖ వ్యాధుల గురించి

# అవగాహన కార్యక్రమం



**ఆంధ్రనాడు, చౌడేపల్లి, సెప్టెంబర్ 26 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (విజయవాడ) అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు జిల్లా ఎయిడ్స్, లెప్రసీ టీబీ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై స్థానిక బస్టాండులోని బస్ షెల్టర్ నందు శనివారం కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటకం ద్వారా ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. అలాగే రక్తదానం, సుఖ వ్యాధులు-చికిత్స, కాండోమ్ ఉపయోగం, ఐసిటిసి కౌన్సిలింగ్ కేంద్రాలు మరియు క్షయ వ్యాధికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. సమాజంలో ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష, చిన్నచూపు చూపకుండా వారిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్, సుబ్బరాము, కళాజాత బృందం సభ్యులు బిట్రగుంట, నాగస్వామి, లక్ష్మీదేవి, నారాయణరెడ్డి, రమణమ్మ, ఆంజనేయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో

# ముస్లింలకు ప్రాధాన్యత కల్పించాలి

**జేఏసి చైర్మెన్ ముర్తుజా**




**ఆంధ్రనాడు, తిరుపతి, సెప్టెంబర్ 26:** స్థానిక సంస్థగత ఎన్నికలలో రాజకీయ పార్టీలు ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం కల్పించాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ ముర్తుజా కోరారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో శనివారం ముర్తుజా మాట్లాడుతూ తిరుపతి స్థానిక ఎన్నికలలో జనాభా దామాస ప్రకారం ముస్లింలకు టికెట్లు కేటాయించాలన్నారు. ఈసారి ఎన్నికల్లో ప్రతి పార్టీ ముస్లింలకు న్యాయమైన వాటా ప్రకటించాలని, మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉన్న డివిజన్లలలో ముస్లిం అభ్యర్థులు నియమించాలన్నారు. తిరుపతి నగరంలో 66 డివిజన్లు వున్నాయని, మాకు 6 డివిజన్లు కేటాయించాలన్నారు. ప్రధాన పార్టీలు ముస్లింలకు సీట్లు కేటాయించక పోతే ఇండిపెండెంట్లు గానైన పోటీ చేస్తామని ముర్తుజా స్పష్టం చేసారు. ఈ విలేఖర్ల సమావేశం జేఏసి నాయకులు కలిముల్లా, ఫయిజుల్లా, అమీర్ భాష, సాధిక్, మూనీవర్, మెకానిక్ బాబు పాల్గొన్నారు.

మీ భూమి మీ హక్కు

# రీ సర్వేతో రైతులకు శాశ్వత పరిష్కారం

**ఏపీ స్టేట్ కురుబ - కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప**



**ఆంధ్రనాడు, ఆదోని, సెప్టెంబర్ 26:** ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామంలో రీ సర్వేపై అవగాహన గ్రామ సభ నిర్వహించారు. ఆదోని ఆర్డీఓ, తహసీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు ఏపీ స్టేట్ కురుబ--కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మీ భూమి - మీ హక్కు' రీ సర్వే ద్వారా ఏళ్ల తరబడి పరిష్కారం కాని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు ఎలాంటి ఖర్చు లేకుండా పట్టాదారు పాస్‌బుక్ పొందే అవకాశం ఉన్నందున ప్రతి రైతు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీ సర్వేలో ప్రభుత్వ, ఎల్‌సీ, హీనం, గ్రామకంఠ, పోరంబోకు భూములను గుర్తించడంతో పాటు పొలాలకు వెళ్లే రహదారుల వివరాలను కూడా స్పష్టంగా నమోదు చేయాలని అధికారులను కోరారు. కొంతమంది రైతులు ఆక్రమించిన వ్యవసాయ రహదారులను గుర్తించి, వాటిని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పెద్ద హరివాణంలోని లక్ష్మమ్మ చెరువు సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా ప్రస్తుతం ఆక్రమణల కారణంగా 30 ఎకరాలకు కూడా తగ్గిపోయిందని తెలిపారు. చెరువు భూమిని పరిరక్షిస్తే సుమారు 2 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. పెద్ద హరివాణం గ్రామంలో సుమారు 14 వేల ఎకరాల భూమి, రెండు సచివాలయాలు ఉన్నందున రైతుల సౌకర్యార్థం ఇద్దరు వీఆర్వోలు, ఇద్దరు సర్వేయర్లు, ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేయాలని ఆర్డీఓ, తహసీల్దార్‌ను కోరారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఏడు డిమాండ్లతో ప్రభుత్వానికి వినతి.. స్పందించకపోతే ఐక్య పోరాటం**




ఆంధ్రనాడు, ఆదోని టౌన్, సెప్టెంబర్ 26: రాయలసీమ జిల్లాల్లో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఒప్పంద కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి రాయలసీమ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వానికి ఏడు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించేందుకు నిర్ణయించారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఎంటీఎస్ విధానాన్ని అమలు చేయాలని, క్యాడర్ విభజన చేసి దానికి అనుగుణంగా వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన కార్మికులు, ఉద్యోగులకు రిటైర్డ్ బెనిఫిట్స్‌తో పాటు పింఛను సౌకర్యం కల్పించాలని కోరారు. ఉద్యోగంలో ఉండగా మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించే విధంగా జీవో అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పండుగలు, వారాంతపు సెలవులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పని చేయాల్సి వస్తే వాటిని పని దినాలుగా గుర్తించి సెలవు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రాయలసీమ జిల్లాల మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, ఉద్యోగులను ఐక్యం చేసి ప్రభుత్వంపై పోరాటం చేపడతామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

# గిరిజన కళా వారసత్వాన్ని కాపాడుకోవాలి: వక్తలు

**ఘనంగా ముగిసిన గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు**





**ఆంధ్రనాడు, తిరుపతి (ఎస్వీయూ) – సెప్టెంబర్ 26:** గిరిజనుల కళా, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ ఆదివాసీ గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన కళాకారులు తమ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించారు. కళాకారుల ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గిరిజనుల జీవన విధానం, సంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా సాగిన కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆడిటోరియంలో గిరిజన కళాకారుల ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. గిరిజన కళా సంపదను ఒకే వేదికపై ప్రదర్శించడం ద్వారా వివిధ ప్రాంతాల సంస్కృతుల మధ్య ఉన్న వైవిధ్యాన్ని, ప్రత్యేకతను తెలియజేయగలిగారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కరంశి అక్కులప్ప నాయక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు, యువత, ప్రజల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గిరిజనుల హక్కులు, విద్య, ఉద్యోగాలు, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఎస్వీయూ హిందీ విభాగాధిపతి డా. నారాయణ రాథోడ్, ఫిలాసఫీ విభాగాధిపతి డా.శ్రీనివాసులు నాయక్, వివిధ రాష్ట్రాల నాయకులు, తెలుగు రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారు.

ఊరి గంగమ్మ దేవాలయ

# నిర్మాణానికి శంకుస్థాపన చేసిన

**శాసనమండలి చీఫ్ విప్ కంచర్ల శ్రీకాంత్**





**ఆంధ్రనాడు, రామకుప్పం, సెప్టెంబర్ 26:** రామకుప్పం మండలం కంచనపల్లి పంచాయతీ గాంధీ నగరం గ్రామంలో శ్రీ వాణి ట్రస్టు ద్వారా ఊరి గంగమ్మ దేవాలయ నిర్మాణానికి శాసనమండలి చీఫ్ విప్ కంచర్ల శ్రీకాంత్ భూమి పూజ చేశారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశం మేరకు, 25 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టి నారని తెలిపారు అనంతరం జరిగిన సమావేశంలో స్థానిక ఎన్నికలలో కూటమి అభ్యర్థులు గెలుపొందిన విధంగా చూడాల్సిన అవసరం ఉన్నదని ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు దీనికి మార్గమని కుప్పం అభివృద్ధి పథంలో సాగుతుందని విమానాశ్రయం పనులు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్, చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆనంద రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి గ్రంథాలయ బోర్డు డైరెక్టర్ మునుస్వామి స్థానిక టిడిపి నాయకులు పట్ట నారాయణ రామమూర్తి జయశంకర్ ఇంకా పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ హార్టికల్చర్

# హబ్‌పై వీడియో, రీల్స్ కంటెస్ట్

**విస్తృతంగా పాల్గొని అవగాహన కల్పించాలి**
**కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



**ఆంధ్రనాడు – తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 26:** రాయలసీమను ఉద్యాన పంటల సాగు, ఎగుమతుల్లో ప్రపంచస్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో చేపట్టనున్న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్' కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వీడియో, రీల్స్ కంటెంట్ కంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను ఉద్యాన పంటల సాగు, ప్రాసెసింగ్, ఎగుమతులకు అనువైన గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే లక్ష్యంతో లక్ష కోట్ల రూపాయలతో సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మదనపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల సమక్షంలో ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ ప్రాంతం దీర్ఘకాలంగా నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ఇక్కడి శీతోష్ణస్థితి విలువైన పండ్లు, కూరగాయల సాగుకు అనుకూలంగా ఉందన్నారు. ఉద్యానవన రంగంలో నీటి సంక్షోభాన్ని అధిగమించేందుకు 2003లో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపి) ప్రారంభించబడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉద్యానవన రంగాన్ని 'స్వర్ణాంధ్ర' సాధనకు కీలక రంగంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సమీకృత ఉద్యానవన అభివృద్ధి ప్రణాళిక (ఐహెచ్డిపి) రూపొందించినట్లు తెలిపారు. కాంటెస్ట్‌లో పాల్గొనే వారు రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను భారతదేశపు 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా ఎలా అభివృద్ధి చేయవచ్చో సృజనాత్మకంగా, వినూత్నంగా చూపించేలా 60 నుంచి 90 సెకన్ల నిడివి గల వీడియో లేదా రీల్ రూపొందించాలి. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రభావం, వ్యవసాయ భవిష్యత్తు, రైతులకు అవకాశాలు, ఉపాధి అవకాశాలను ఇందులో ప్రతిబింబించవచ్చు. కంటెంట్ క్రియేటర్లు ఏదైనా ఒక జిల్లాను లేదా నిర్దిష్ట ఉద్యాన ఉత్పత్తిని కేంద్రంగా చేసుకుని వీడియో రూపొందించవచ్చు. ఇన్‌ఫ్లుయెన్సర్లు, వీడియో మేకర్లు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు, ఇతర ఆసక్తి ఉన్న వారు ఎవరైనా ఈ కంటెస్ట్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. సెప్టెంబర్ 26 నుంచి ప్రారంభమైన కంటెస్ట్ సెప్టెంబర్ 30 మధ్యాహ్నం 12 గంటలకు ముగుస్తుంది. ఆఖరి గడువులోపు అందిన వీడియోల్లో ఉత్తమ ఐదు వీడియోలను ఎంపిక చేసి అక్టోబర్ 1న విజేతలకు సమాచారం అందిస్తారు. ఎంపికైన ఐదు వీడియోలను అక్టోబర్ 2న మదనపల్లిలో నిర్వహించే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ బహిరంగ సభలో సుమారు 50 వేల మంది సమక్షంలో ప్రదర్శించనున్నారు. విజేతలకు ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి చేతుల మీదుగా సత్కారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పాల్గొనేవారు తమ వీడియోలు లేదా రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), లింక్డ్ఇన్ తదితర సోషల్ మీడియా వేదికల్లో తమ ఖాతాల ద్వారా పోస్ట్ చేసి, AP డిజిటల్ కార్పొరేషన్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్రూాటటఅఏఋశ్రీచీవషంను ట్యాగ్ చేయాలి. తప్పనిసరిగా # RayalaseemaVijayeeBhava, # RayalaseemaRising, # GlobalHorticultureHub, # PrapanchaUdhyanaKendram, # APOfficialNews హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగించాలి. కాంటెస్ట్‌కు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియా గ్రూపులు, యూనివర్సిటీలు, విద్యాసంస్థలు, వాట్సాప్ గ్రూపులు, కేబుల్ చానళ్లు, మీడియా సంస్థల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.




పెద్దహరివాణంలో

# రీ-సర్వే గ్రామ సభ

**ఆంధ్రనాడు, ఆదోని, సెప్టెంబర్ 26:** ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో శనివారం రీ-సర్వే ఫేజ్-6 గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదోని రెవెన్యూ డివిజనల్ అధికారి హాజరై రీ-స ర్వే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో రీ-సర్వేకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వ హించి, వారి నుంచి వివరాలను తెలుసుకున్నారు. రీ-సర్వేలో ఎదురవుతున్న సమస్యలు, భూములకు సం బంధించిన వివరాలు, రికార్డుల పరిశీలన తదితర అంశాలపై గ్రామస్థులతో అధికారులు చర్చించారు. గ్రా మస్థుల సందేహాలను తెలుసుకుని సంబంధిత అంశాలపై అధికారులు వివరాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వినాయక సాగర్‌ను

# పరిశీలించిన కమిషనర్ ఎం.జయకృష్ణ



**ఆంధ్రనాడు, తిరుపతి, సెప్టెంబర్ 26 :** నగరంలోని వినాయక సాగర్ ను నగరపాల క సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సిబ్బంది తో కలిసి శనివారం పరిశీలించారు. వినాయ క చవితి నిమజ్జనాల అనంతరం సాగర్ లో పేరుకుపోయిన విగ్రహ శకలాలు,పూల దండలు, ప్లాస్టిక్ వ్యర్థాలను కమిషనర్ పరిశీలించారు. సాగర్ ను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయాలని, నీటి నాణ్యతను కాపాడాలని అధికారులను ఆదేశించారు.అదే సమయంలో అక్కడ వాకింగ్ కు వచ్చే వాకర్స్ కమిషనర్ ను కలిసి, సాగర్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు పాడైపోయాయని, వాటిని మరమ్మతు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్, వెంటనే జిమ్ పరికరాలను పరిశీలించి మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించా రు.కమిషనర్ వెంట డీఈ రమణ, సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలపై తిరుపతి 2వ

# డివిజన్‌లో పర్యటించిన టీడీపీ ఇన్చార్జి



**ఆంధ్రనాడు, తిరుపతి, సెప్టెంబర్ 26 :** ప్రజలు రోడ్డు పై ప్రవహిస్తున్న మురుగునీటి తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటికి శాశ్వత పరిష్కారం చూపుతానని తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జి జేబీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. తిరుపతి నియోజకవర్గం పరిధిలోని 2వ డివిజన్ గొల్లవాని గుంట, పూలవానిగుంట ప్రాంతాల్లో శనివారం ఉదయం స్థానికులతో కలిసి పర్యటించి మురుగునీటి సమస్యలను పరిశీలించారు. కల్వర్టు లు, యూడీఎస్ ఛాంబర్ ను పరిశీలించి నూతన నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నార ని, శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేసి త్వరతిగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గొల్లవానిగుంట చెరువును పరిశీలించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.60 లక్షల నాబార్డు నిధులతో అదనపు

# గిడ్డంగి నిర్మాణానికి భూమిపూజ



**ఆంధ్రనాడు, ఆదోని టౌన్, సెప్టెంబర్ 26:** రాష్ట్రంలోని అతిపెద్ద వ్యవసాయ రైతు మార్కెట్లలో ఒకటైన ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు అదనపు గిడ్డంగి నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కేంద్ర నాబార్డు నిధులు రూ.60 లక్షలతో 60 అడుగుల వెడల్పు, 100 అడుగుల పొడవుతో షెడ్‌ను నిర్మించనున్నారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి.వి. పార్థసారథి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నాయని తెలిపారు. రైతే దేశానికి వెన్నెముక అని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకునేలా మార్కెట్‌యార్డుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు సౌకర్యవంతంగా పంటలు విక్రయించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ జిందే శారద, కార్యదర్శి సీతారామయ్య, డీఈ, వైస్ చైర్మన్ అందూరి విజయ్ కృష్ణ, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ద హరివాణం పీహెచ్‌సీలో సమయానికి

# వైద్యులు అందుబాటులో ఉండాలి

**జనసేన పార్టీ ఆదోని**



**ఆంధ్రనాడు, ఆదోని, సెప్టెంబర్ 26:** ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమయానికి వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదోని పట్టణంలోని జిల్లా ఉప వైద్యాధికారి కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఎం. తాహేర్ వలి మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో పెద్ద హరివాణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఓ గర్భిణి ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు గ్రామస్థుల నుంచి సమాచారం అందిందన్నారు. పేద ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా ఆరోగ్య కేంద్రాల్లో నిర్ణీత సమయానికి వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఉప వైద్యాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి అక్కడి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శాంతా, హరిబాబు, ఏ.వి. వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత

# సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేయాలి

**ఉల్లంఘించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి**
**ఆర్టీసీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి**
**ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు**



**ఆంధ్రనాడు - మదనపల్లి - సెప్టెంబర్ 26:** ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణగా ఉన్న ఉద్యోగ భద్రత సర్క్యులర్ 01/2019ను రాష్ట్రవ్యాప్తంగా కచ్చితంగా అమలు చేయాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. సర్క్యులర్‌ను ఉల్లంఘించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మదనపల్లి లోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అన్నమయ్య జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులపై చర్యలు తీసుకునే సమయంలో సర్క్యులర్ 01/2019లోని నిబంధనలను అధికారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉద్యోగ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఏకపక్ష చర్యలు చేపడితే యూనియన్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. స్త్రీ శక్తి పథకం అమలుతో పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీలో బస్సులు, సర్వీసులు, సిబ్బందిని పెంచాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే 4 వేల కొత్త బస్సులను సమకూర్చడంతోపాటు కొత్త సర్వీసులను ప్రారంభించాలని సూచించారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు, యాంత్రిక సిబ్బందితోపాటు అన్ని కేటగిరీల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అవసరమైన విద్యుత్ బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేసి, సిబ్బందితో నిర్వహించాలని కోరారు. ప్రైవేటు సంస్థల ద్వారా విద్యుత్ బస్సుల నిర్వహణ విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. ఆర్టీసీ ఆస్తులు, డిపోలు, రూట్లు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని స్పష్టం చేశారు. విద్యుత్ బస్సుల ప్రైవేటు నిర్వహణ కోసం మూసివేసిన విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, మంగళం డిపోలను పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.పీ. బాబు అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి బి.సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మదనపల్లి డిపోల గౌరవాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు ఎన్. నాగూర్‌వలి మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులు, సౌకర్యాల కోసం పనిచేస్తున్న ఈయూ బలపరిచిన అభ్యర్థులను సీసీఎస్ ఎన్నికల్లో గెలిపించేందుకు సహకరిస్తానన్నారు. యూనియన్ నాయకుడు రాజశేఖర్ మాట్లాడుతూ డిసెంబరులో జరగనున్న సీసీఎస్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ఎన్.బి.రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.వి.కుమార్, కడప జోన్ కార్యదర్శి ఎన్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ డిపోల నాయకులు, ఉద్యోగులు, మహిళా ప్రతినిధులు సహా హాజరయ్యారు.

మదనపల్లి కి విచ్చేసిన రాష్ట్ర బాలల

# హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు

**మర్యాదపూర్వకంగా కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు**



**ఆంధ్రనాడు -మదనపల్లి -సెప్టెంబర్ 26:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలోని రహదారులు మరియు భవనముల శాఖ అతిథి గృహము నందు రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిటీ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు,చల్ల మధుసూదన రావుని మదనపల్లి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఇందులో భాగంగా ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ బాలలకు సంబంధించిన పలు బాలల సమస్యలను కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.ముఖ్యంగా పంచాయతీ స్థాయిలో వివాహాల రిజిస్ట్రేషన్ పటిష్టంగా జరిగేటట్లు గ్రామ/వార్డు బాలల రక్షణ కమిటీలను నిర్మాణం జరిపి,ఆ కమిటీలు పటిష్టంగా పనిచేసేటట్లు మరియు బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే లైన్ డిపార్ట్మెంట్స్ తో కన్వర్జేన్సీ మీటింగులు క్రమంగా నిర్వహించేటట్లు చర్యలు తీసుకొని బాలల సమస్యలు పరిష్కారాన్ని కృషి చేయాలని కోరుతూ కమిటీ సభ్యులకు వినతి పత్రం అందజేశారు.ఈ సమస్యలు సమంజసమైనవేనని గ్రామస్థాయి నుండి కమిటీలను పునఃనిర్మాణము చేపట్టి,బలోపేతం చేసి పటిష్టంగా పనిచేసేటట్లు చర్యలు తీసుకుంటామని,కన్వర్జేన్సీ మీటింగ్ నిర్వహించడానికి మరియు పంచాయతీ స్థాయిలో వివాహాల నమోదు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఫోర్డ్ సంస్థ రూపొందించిన బాల్యవివాహాలు మరియు విద్య యొక్క ఆవశ్యకత గురించి రూపొందించిన పోస్టర్ని విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్ కుమార్,చైతన్య సర్వీస్ సొసైటీ ఎంపీ ఆనందన్,కవితా రాణి,గ్రామజ్యోతి సొసైటీ సుభద్ర,గుడ్ నైబర్స్ సొసైటీ నాగేశ్వరరావు,ఫోర్డ్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలు ప్రభుత్వ

# రాయితీలు వినియో గించుకోవాలి

**నేషనల్ కమిషన్ ఫర్ మైనార్టీస్ వైస్ చైర్ పర్సన్, ఎస్. మనవరి బేగం**




**ఆంధ్రనాడు: సెప్టెంబర్ 26:** ప్రభుత్వ రాయితీలను వినియోగించుకుని, వారి హక్కులను పరిరక్షించుకోవాలని నేషనల్ కమిషన్ ఫర్ మైనార్టీస్ వైస్ చైర్పర్సన్ ఎస్. మునవరి బేగం పిలుపునిచ్చారు. సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనా లో సిఎంజేఏసీ ఆధ్వర్యంలో నేషనల్ మైనారిటీ కమిషన్ వారిచే అవగాహన, పరిష్కార కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్.ము నవరి బేగం మాట్లాడుతూ మైనారిటీస్ వర్గాలకు చెందిన ముస్లింలు క్రిస్టియన్లు, పర్షియన్లు సిక్కులు, బౌద్ధులు వారి హక్కులకు భంగం కలిగే విధంగా ఎవరు ప్రవర్తించినా తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. ఈ సందర్భంగా ఈ దేశంలో మైనారిటీలకు ఉన్న రాయితీలు గురించి, రుణ సౌకర్యాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా బిషప్స్ డయాసిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో క్రైస్తవులకు, ముస్లిమ్స్ కి బరియల్ గ్రౌండ్స్ సమస్యను అధికంగా ఉన్నదని అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవోను తీసుకుని రావాలని, లేని పక్షంలో కనీసం ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి అవసరమైన భూములను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వివరించా రు. అదే సమయంలో క్రిస్టియన్ ముస్లిమ్స్ మీద, ప్రార్థనా మందిరాల మీద దాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిషప్ ఎంఎ పాల్, బిషప్స్ డయాసిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ మంచెలు ప్రవీణ్, అనిల్ పాల్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ బాషా, అబ్దుల్ మునీర్, గౌతమ్ జైన్ , డేవిడ్ మనోహర్, పాస్టర్ ఇస్మాయిల్, జాన్ మస్క్, మైనారిటీల ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు

# అత్తూరులో పోషక ఆహారంపై అవగాహన



**ఆంధ్రనాడు: రేణిగుంట, సెప్టెంబర్ 26:** రేణిగుంట మండలం అత్తూరు గ్రామపంచాయతీ పరిధిలో పోషక ఆహారంపై ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోశనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేణిగుంట మండలం లోని అత్తూరు పంచాయతీ పరిధిలోని అమ్మవారి పట్టెడ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ పోషణ్ మా అభియాన్ కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ కామరాజు పాల్గొని పోషకాహారం ప్రాముఖ్యత దాని ఆవశ్యకత పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, యుక్తవయస్సు బాలబాలికలు, ఐదేళ్లలోపు చిన్నారులు ఆరోగ్యంగా ఉండటానికి సమతుల్య పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. గర్భిణులు,బాలింతలు ఆకుకూరలు,పప్పు ధాన్యాలు, పాలు, గుడ్లు, పండ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు తగిన పోషకాహారం అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఆరు నెలల వరకు శిశువులకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని,ఆరు నెలలు పూర్తయిన తర్వాత తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన అనుబంధ ఆహారం అందించాలని వివరించారు. యుక్త వయస్సులో ఉన్న బాలబాలికలు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని, రక్తహీనత నివారణకు ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలతో పాటు ఆరోగ్య సిబ్బంది సూచించిన ఐరన్ మాత్రలను క్రమం తప్పకుండా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అనంతలక్ష్మి, అంగన్వాడీ టీచర్ కవిత, ఎఎన్ఎం సుకన్య,ఆశాకార్యకర్త పార్వతి, గర్భిణులు, బాలింతలు,యుక్త వయస్సు బాలికలు, గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో వైసీపీకి కోలుకోలేని షాక్.....

**ఎమ్మెల్యే పులివర్తి నాని సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు**
**పసుపు కండువా కప్పుకున్న సీనియర్ నేత, ప్రముఖ వ్యాపారవేత్త చేగు గోవర్ధన్ గుప్తా, మాజీ ఎంపీటీసీ బండారు హేమచంద్రా రెడ్డి (బండారు సుధ)**



**ఆంధ్రనాడు - చంద్రగిరి సెప్టెంబర్ 26:** చంద్రగిరి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నియోజకవర్గంలో శాసనసభ్యులు పులివర్తి నాని చేపట్టిన సుడిగాలి పర్యటన రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే నాని ముందుకు సాగుతుండటంతో, ఆయన నాయకత్వానికి ఆకర్షితులై వైసీపీకి చెందిన కీలక నేతలు, ప్రజాప్రతినిధులు భారీగా టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. దీంతో పట్టణంలో తెలుగుదేశం శ్రేణుల్లో నూతనోత్సాహం, జోష్ వెల్లివిరుస్తోంది. వైసీపీ సీనియర్ నేత, పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త చేగు గోవర్ధన్ గుప్తా, మాజీ ఎంపీటీసీ బండారు హేమచంద్రా రెడ్డి (బండారు సుధా) తమ అనుచరగణంతో కలిసి శుక్రవారం టీడీపీలో చేరారు. పర్యటనలో ఉన్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా వారి ఇంటి వద్దకు వెళ్లి వారికి పసుపు కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

**అభివృద్ధే ప్రామాణికం - స్థానిక పోరులో గెలుపే లక్ష్యం:**

ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ.. ఎన్నికల వేళల్లో ప్రత్యర్థులు ఇచ్చే తాత్కాలిక తాయిలాలు, ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజల జీవితాలు మారబోవని, శాశ్వత అభివృద్ధి మాత్రమే సమాజానికి నిజమైన మేలు చేస్తుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చేపడుతున్న పారదర్శక పాలన, నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పడుతున్న తపన చూసే తాము వైసీపీని వీడి టీడీపీలో చేరామని తెలిపారు. చంద్రగిరి గడ్డను అభివృద్ధికి అసలైన అడ్డాగా మార్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే వెన్నంటి నిలుస్తామని ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయమే ధ్యేయంగా శక్తివంచన లేకుండా పనిచేస్తామని ఎమ్మెల్యే నానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండల స్థాయి సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ కమిటీ

# సభ్యుడిగా ఎల్లార్తి అర్జున్



**ఆంధ్రనాడు, కర్నూలు, సెప్టెంబర్ 26:** భారత చైతన్య యువజన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడిగా కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి వాల్మీకి అర్జున్ నియమితులయ్యారు. పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఎల్లార్తి అర్జున్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయి నుంచి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పనిచేస్తానన్నారు. యువత, మహిళలు, సీనియర్ నాయకులను పార్టీలోకి తీసుకురావడంతో పాటు కర్నూలు జిల్లాలో పార్టీ విస్తరణకు కృషి చేస్తానని తెలిపారు.

గ్రామాల అభివృద్ధి

# చంద్రబాబునాయుడు ధ్యేయం

**రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం**



**ఆంధ్రనాడు, రామకుప్పం, సెప్టెంబర్ 26 :** రామకుప్పం మండలం రాజుపేట గ్రామంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం శనివారం ఊరి గంగమ్మ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా దేవాలయ నిర్మాణానికి కూడా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని పేర్కొన్నారు గ్రామాలఅభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా పట్టుదలతో ఉన్నారని స్వయంకృషి ద్వారా పరిశ్రమలకు స్థాపనకు ముందుకొచ్చి యువకులకు ప్రభుత్వ సహాయం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టిటిడి పాలక మండలి సభ్యులు శాంతారామ్, చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీతాపతి,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆనంద రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి టిడిపి నాయకులు నర్సింహులు నారాయణ స్వామి ఇంకా పలువురు పాల్గొన్నారు

తిరుపతి రూరల్ లోమద్యం

# షాపుకు దరఖాస్తు ఆహ్వానం

**ఆంధ్రనాడు, తిరుపతి,సెప్టెంబర్ 26 :** తిరుపతి రూరల్ పరిధిలోని ఓపెన్ క్యాటగిరి లోని "ఏ ఫోర్"షాపు టెండర్ కు దరఖాస్తు ఆహ్వానించడం జరిగిందని ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఇ. నరసా నాయుడు శనివారం తెలియజేశారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్లైన్ అప్లికేషన్ పద్ధతుల్లో తమ దరఖాస్తును సమర్పించాలని కోరారు. అలాగే దరఖాస్తు చివరి తేదీ అక్టోబర్ ఒకటో తేదీ అర్ధరాత్రి లోపు అప్లికేషన్ ప్రాసెస్ పూర్తి చేయాలని కోరారు. అలాగే అప్లికేషన్ దరఖాస్తు విధానం ఆఫ్లైన్ ద్వారా దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు మూడు లక్షల రూపాయలు డీ.డీ రూపంలో తీసుకుని ఎం ఆర్ పల్లి సర్కిల్ వద్ద ఉన్న ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ తిరుపతి రూరల్ నందు నేరుగా సమర్పించిన ఎడల అప్లికేషన్ ప్రాసెస్ స్టేషన్ నందు చేయడం జరుగుతుందన్నారు. లాటరీ నిర్వహణ తేదీ అందిన దరఖాస్తుల ఆధారంగా అక్టోబర్ 5వ తేదీన లాటరీ ప్రక్రియ నిర్వహించి షాపులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు గడువు ముగిసే లోపు తమ దరఖాస్తులను సమర్పించి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలు కోసం తిరుపతి రూరల్ ప్రొహి బి షన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నందు గాని ఈ ఫోన్ నెంబర్ 9440902543 నెంబర్ అబ సంప్రదించాలని తెలియజేశారు.

గృహ వ్యర్థాలతో

# వర్మి కంపోస్టింగ్ తయారీపై శిక్షణ




**పెద్దపంజాణి, ఆంధ్రనాడం, సెప్టెంబర్ 26 :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం స్వయం సహాయక బృందాల సభ్యులకు కిచెన్ గార్డెన్ మరియు హోం కంపోస్టింగ్ గురించి ఒకరోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాలాజీ మాట్లాడుతూ శిక్షణ పొందిన పొదుపు సంఘాల సభ్యులు తమ తమ గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి గృహ వ్యర్థాల నిర్వహణ, ఇంటి వద్దే వానపాముల ఎరువు (వర్మీ కంపోస్ట్) తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే వంటగది నుండి వచ్చే వ్యర్థ నీటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఇంటి ఆవరణలోనూ కూరగాయలు, పూలు, పండ్ల మొక్కలను ఏ విధంగా పెంపొందించుకోవాలో గ్రామస్తులకు వివరించి విస్తృత ప్రచారం కల్పించనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెనింగ్, హోం కంపోస్టింగ్ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి, మండల స్వర్ణ గ్రామ అధికారి సుధాకర్, వెలుగు ఏపీఎం నీరజ, మాస్టర్ ట్రైనర్స్ నిరుపమ, భారతి, జయచంద్ర, సీసీలు, స్వయం సహాయక బృందాల సభ్యులు లీడర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల

# కోసమే స్వచ్ఛరథం

**: ఎంపీడీవో బాలాజి**



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, సెప్టెంబర్ 26 :** మండలంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ రథం సేవలను స్వయం సహాయక బృందాల సభ్యులు, వివో లీడర్లు శనివారం పరిశీలించారు. ప్రజల నుండి వారి గృహాల వద్దనే నిరుపయోగ కరమైన వస్తువులను తీసుకొని అందుకు బదులుగా వారికి అవసరమైన నాణ్యత కలిగిన సరుకులను అందజేస్తున్నట్లు ఎంపీడీవో బాలాజి, డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి, మండల స్వర్ణ గ్రామ అధికారి సుధాకర్ మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ సుధాకర్, ఏపీఎం వెలుగు నీరజ, పరిపాలన అధికారి సురేంద్రరెడ్డి, కార్యాలయ సిబ్బంది సల్మాన్, ఉషా, స్వయం శాఖ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్ కు జ్యుడిషల్ కస్టడీ



**ఆంధ్రనాడు, రేణిగుంట. సెప్టెంబర్ 26:** రౌడీ షీటర్ కు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు రేణిగుంట అర్బన్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు.జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో నేర నియంత్రణ, రౌడీషీటర్లపై నిఘా, సంఘవిద్రోహ కార్యకలాపాల అరికట్టడంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించిన ఒక రౌడీషీటర్‌పై కఠిన చర్యలు తీసుకుంటూ 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడం జరిగింది. నేరాలకు పాల్పడేవారికి ఇది స్పష్టమైన హెచ్చరికగా నిలుస్తుందని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో రెడ్డిపల్లి ఇబ్రహీం కలీల్ ఏ షేక్ ఇమామ్( 29 ) గత 6 సంవత్సరాలుగా మద్యానికి బానిసై, తరచూ గొడవలకు పాల్పడటం, అలాగే మద్యం మత్తులో ఎదురుపడిన గుర్తుతెలియని వ్యక్తులను బెదిరించడం మరియు కొట్టడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వలన ఇతని పై రేణిగుంట పోలీస్ స్టేషన్ లో మూడు కేసులు, గాజుల మాండ్యం పోలీస్ స్టేషన్ లో ఒక కేసు చెప్పున మొత్తం నాల్గు కేసులు ఉన్నందున అతని పై రౌడీషీట్ తెరవబడింది. నేరప్రవృత్తికి దూరంగా ఉండి సత్ప్రవర్తనతో జీవించే అవకాశం కల్పించే ఉద్దేశంతో రేణిగుంట డీస్పీ సూచనలతో రేణిగుంట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. జయచంద్ర , సదరు వ్యక్తిని రేణిగుంట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట బైండ్ ఓవర్ చేయించారు.అయితే, బైండ్ ఓవర్‌లో ఉన్నప్పటికీ 15-09-2026 వ తేదీన అర్ధ రాత్రి బుగ్గ వీది లో మద్యం త్రాగి అక్కడ వినాయక విగ్రహం వద్ద పాటలు పెట్టమని వారి తో గొడవ పడినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో అతని పై కేసు నమోదు చేయడం అయినది. అంతట బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు రేణిగుంట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ శ్రావణ్ కుమార్ ఎదుట హాజరుపరచారు. విచారణ అనంతరం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా పోలీసులు స్పష్టం చేస్తూ రౌడీషీటర్లు, పునరావృత నేరస్థులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు మరియు సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టం ప్రకారం మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. బైండ్ ఓవర్ వంటి నిరోధక చర్యలను ఉల్లంఘించే వారికి ఎలాంటి ఉపేక్ష ఉండదని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# అంబరాన్నంటిన వినాయక నిమజ్జన వేడుకలు

**ఆర్.ఎఫ్ రోడ్డులో వైభవంగా శోభాయాత్ర**
**బ్యాండ్ బాజాలు, డీజే పాటలు,**
**మంగళవాయిద్యాలతో మార్మోగిన పురవీధులు**



**ఆంధ్రనాడు - చంద్రగిరి సెప్టెంబర్ 26 :** నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరి పట్టణంలోని ఆర్.ఎఫ్ రోడ్డులో శనివారం వినాయక స్వామి నిమజ్జన మహోత్సవం అత్యంత వైభవంగా, కోలాహలంగా సాగ. గణేశ్ నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా కొలువుదీరిన లంబోదరుడిని సాగనంపేందుకు భక్తులు, స్థానిక ఆర్.ఎఫ్ రోడ్డు యువత భారీ ఎత్తున తరలివచ్చారు. స్వామివారి శోభాయాత్ర ఆద్యంతం భక్తిప్రపత్తులతో, ఆనందోత్సాహాల నడుమ సాగింది. మార్మోగిన బ్యాండ్ బాజాలు, డీజే పాటల హోరు, సాంప్రదాయ మంగళవాయిద్యాల సవ్వడులు పరిసరాలను ఆధ్యాత్మిక శోభతో ముంచెత్తాయి. యువకులు, భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు.వీధుల్లో స్వామివారి ఊరేగింపు సాగుతుండగా మహిళలు ఇళ్ల ముంగిట హారతులు పడుతూ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల జయజయధ్వానాల నడుమ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ నిమజ్జన వేడుకలను అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల వాసులు, స్థానిక యువత, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# బండారు హేమచంద్రారెడ్డి టీడీపీ చేరికతో హర్షం

**అన్న క్యాంటీన్‌లో ఘనంగా అన్నదానం!**



**ఆంధ్రనాడు - చంద్రగిరి సెప్టెంబర్ 26 :** చంద్రగిరి పట్టణానికి చెందిన సీనియర్ యువ నాయకుడు, మాజీ ఎంపీటీసీ బండారు హేమచంద్రారెడ్డి (బండారు చంద్ర) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో పట్టణ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఆయన చేరికను పురస్కరించుకుని టీడీపీ సీనియర్ నాయకులు ప్రభాకర్ నాయుడు ఆనందోత్సాహాలతో ఆయనను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శనివారం చంద్రగిరి పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద గల 'అన్న క్యాంటీన్' నందు పేదలకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయంగా నాయకులే ముందుండి ప్రజలకు, నిరుపేదలకు భోజనాలు వడ్డించారు. అనంతరం సీనియర్ నాయకులు ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ.. బండారు హేమచంద్రారెడ్డి గతంలో టీడీపీలోనే కొనసాగారని, మధ్యలో కొన్ని రాజకీయ కారణాల వల్ల వైసీపీలోకి వెళ్లినప్పటికీ, ఇప్పుడు తిరిగి తన సొంతగూటికి చేరుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. ఆయన తిరిగి పార్టీలోకి రావడం చంద్రగిరిలో టీడీపీ బలాన్ని మరింత పెంచిందని, ఈ ఆనందాన్ని పేదలతో పంచుకోవాలనే ఉద్దేశంతోనే అన్న క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని నాయకత్వంలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల, పట్టణ స్థాయి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా

# పిల్లలకు పోషకాలతో కూడిన పౌష్టికాహారం




**ఆంధ్రనాడు - రామచంద్రాపురం, సెప్టెంబర్ 26:** అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు,గర్భిణులకు,బాలింతలకు పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు సూపరవైజర్ రేవతి అన్నారు. రామచంద్రాపురం మండల, రాయల చెరువు సెక్టార్ పరిధిలోని రామానాయుడు కండ్రిగ,పరమాల, వైఆర్ కండ్రిగ, అంగన్వాడి కేంద్రంలో శనివారం పోషణ మా కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి ఉత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా 0-6 సంవత్సరాల పిల్లల పోషక స్థితి, గర్భిణీలు, బాలింతలకు, గృహ సందర్శన నమోదు, మైగ్రేషన్ మోడల్ ద్వారా లబ్ధిదారులను ఒక అంగన్వాడి కేంద్రం నుండి మరొక కేంద్రానికి బదిలీ చేయడం వంటివి వివరించారు.గ్రోత్ మానిటరింగ్, రోజు వారి కార్యక్రమం సంబంధిత సేవల నమోదు. అంగన్వాడీ కేంద్రాల సందర్శన షెడ్యూల్ చేయుటం, అంగన్వా కేంద్రాల మౌలిక వసతులు వివరాలను నెలకొక సారి నవీనకరించటం, వెనుకబడిన ప్రాంతాలు/ కేంద్రాలు గుర్తించటం చేసారు. పిల్లలకు అంగన్వాడి కేంద్రంలోనే బరువులు తీయడం జరిగినది అదేవిధంగా ఏఎన్ఎం మంజుల ఇమ్యునైజేషన్ చేసారు. సీజనల్ డిసిజియస్ గురించి కూడా తెలియజేసారు. పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు అంగన్వాడి హెల్పర్లు ఏఎన్ఎమ్ లు, ఆశా వర్కర్లు, తల్లులు, పిల్లలు అందరూ పాల్గొన్నారు.

ఫార్మసిస్టులంటే ఔషధాలు

# పంపిణీ చేసే వారు కాదు......

**మోహన్ బాబు యూనివర్సిటీలో ఘనంగా 'ప్రపంచ ఫార్మసిస్ట్" దినోత్సవం**

**ఆంధ్రనాడు - చంద్రగిరి, సెప్టెంబర్ 26:** పార్మాసిస్టులంటే కేవలం మందులను పంపిణీ చేసేవారే కాదని, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, రోగుల సలహాదారులు, ప్రజారోగ్య పరిరక్షణలో కీలక భాగస్వాములు అని ఎంబీ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ ఎం. ఆర్. జయప్రకాష్ అన్నారు.చంద్రగిరి మండలం, ఏ రంగంపేట సమీపం లోని సాయినాథ్ నగర్ లో ఉన్న మోహన్ బాబు యూనివర్సిటీలో శనివారం ఘనంగా నిర్వహించిన 'ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం' వేడుకల్లో ఆయన కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు వృత్తిపరమైన నైతిక విలువలు పాటిస్తూ రోగుల భద్రతకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. అలాగే సమాజంలో సూక్ష్మజీవ నిరోధకత పెరుగుతున్న నేపథ్యంలో, యాంటీబయాటిక్స్, ఔషధాల సురక్షిత వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు నాటకాలు, రంగోలి, సైటూన్స్, పోస్టర్లు మరియు రీల్ మేకింగ్ వంటి సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. ఫార్మసీ కౌన్సిల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వి. షణ్ముగం మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యానికి, డీన్, అధ్యాపకులు, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



విద్యార్థులు లక్ష్య సాధనకు

# ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి




**ఆంధ్రనాడు - రామచంద్రాపురం,సెప్టెంబర్ 26:** విద్యార్థులు లక్ష్య సాధనకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జేఎన్టీయూ కళాశాల కెమిస్ట్రీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ కెబి చంద్రశేఖర్ అన్నారు. రామచంద్రాపురం మండలం, వెంకట్రామాపురంలోని సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ లో శనివారం ఐదవ గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి బాహ్య ప్రపంచంలో అడుగు పెడుతున్న సమయంలో ఏ విధంగా మెలగాలో వివరించారు. నేర్చుకున్న విద్య ద్వారా పదిమందికి ఆదర్శంగా నిలిచే విధంగా జీవితాన్ని సాగించాలని సూచించారు.తిరుపతి ఆదాయపన్ను అధికారి శివశంకర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నేర్చుకున్న విజ్ఞానాన్ని మలుచుకుని ముందుకు సాగాలని కోరారు.ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు.బి ఫార్మసీ,యం ఫార్మసీ, ఫార్మా డి, పూర్తి చేసిన వారికి పట్టాలు అందజేశారు.పట్టాలు పొందిన వారిలో ఆనందం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రాజు , విభాగాధిపతులు శరవణ, జ్యోతి,శివగామి, పరీక్షల నియంత్రణాధికారి సతీష్ కుమార్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# విజ్ఞానగిరిని తవ్వేస్తున్నా పట్టించుకోరా

**మాజీ ఎమ్మెల్యే బియ్యపు**



**ఆంధ్రనాడు - శ్రీకాళహస్తి , సెప్టెంబర్ 26 :** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ దేవాలయంగా వెలసిన విజ్ఞానగిరిని అధికార పార్టీకి చెందిన నాయకుడు యంత్రాలతో తవ్వేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే , ఆలయ ఈవో పట్టించుకోరా అంటూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి ప్రశ్నించారు . మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి విజ్ఞానగిరిని తొలి చేస్తున్న ప్రాంతానికి వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేసి , కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు . అనంతరం ఆయన మాట్లాడుతూ విజ్ఞాన గిరికి అతి పురాతన చరిత్ర ఉందన్నారు . విజ్ఞనగిరిపై వెలసిన కుమార స్వామికి నిత్య కైంకర్యాలు జరుగుతుంటాయని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తమ హయాంలో కొండ చుట్టూ కొన్ని నివాసాలను కలిగి చేసి వినాయకుడి మండపాన్ని నిర్మించినట్లు గుర్తు చేశారు. అయితే టిడిపి నేత ఏకంగా కొండను తవ్వేస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే, ఈవో ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. టిడిపి నేత చర్యతో హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతింటున్న నేపథ్యంలో సనాతన ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్ గా చెప్పుకునే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విజ్ఞానగిరిని కాపాడకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు . అనంతరం ఈవో బీకే వెంకటేశులుకు వినతిపత్రం అందజేశారు . ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు , శరవణ కుమార్ , కంఠా ఉదయ్ కుమార్ , మున్నా , జయశ్యామ్ , సురేష్ తదితరులు పాల్గొన్నారు .

మద్యం మత్తులో

# ఆటో డ్రైవర్ బీభత్సం

**ద్విచక్ర వాహనం ఢీ, ఇద్దరికీ స్వల్ప గాయాలు**



**ఆంధ్రనాడు - చంద్రగిరి, సెప్టెంబర్ 26:** మద్యం మత్తులో మితిమీరిన వేగంతో ఆటో నడుపుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తితో పాటు ఆటో డ్రైవర్ కూడా అదుపుతప్పి కిందపడిపోయారు. అదృష్టవశాత్తూ ఇద్దరికీ స్వల్ప గాయాలతో ప్రాణాపాయం తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఇరువర్గాల మధ్య మాటామాటా పెరగకుండా సర్దిచెప్పి, అక్కడి నుంచి పంపించివేశారు.ఇలాంటి ఘటనలు చంద్రగిరిలో నిత్యకృత్యంగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

శ్రీ జలకంఠేశ్వర స్వామి

# ఆలయంలో పౌర్ణమి పూజలు



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, సెప్టెంబర్ 26 :** మండలంలోని కోగిలేరు సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ జలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కల్లుపల్లికి చెందిన వేణుగోపాల్ స్వామి భజన బృందం శివకోటి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నరెడ్డి, కృష్ణ, మోహన్, రవి, నాగప్ప, నారాయణ, శేషు, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ల మార్గదర్శకత్వంలో మరింత అభివృద్ధి



**ఆంధ్రనాడు - చంద్రగిరి, సెప్టెంబరు 26:** సీనియర్ల మార్గదర్శకత్వంలో మరింత అభివృద్ధి సాదించవచ్చని యంయల్ఏ పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తిని శాసనసభ్యులు పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిశారు. రామ్మూర్తి నివాసానికి స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే, ఆయనతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించి యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులు, పట్టణ పురోగతికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారిద్దరూ కూలంకషంగా చర్చించారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో సీనియర్ నాయకుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తమ అనుభవంతో యువతకు మార్గదర్శకంగా నిలుస్తూ,అభివృద్ధి కార్యక్రమాలకు తగిన సూచనలు, సలహాలు అందించి సహకరించాలని దుబాసి రామ్మూర్తిని కోరారు.

తపస్య స్కూల్లో

# రతన్ టాటా ఇన్నోవేషన్



**ఆంధ్రనాడు, రేణిగుంట, సెప్టెంబర్ 26:** రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో రేణిగుంట డాక్టర్ బషీర్ తపస్య స్కూల్ లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో తపస్య యంగ్ ఇన్నోవేటర్స్ ఛాలెంజ్ - 2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు పాఠశాలను సందర్శించి విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులను పరిశీలించారు.విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలు, ప్రాజెక్టుల పనితీరును అతిథులకు వివరించారు. ప్రాజెక్టుల పరిశీలన అనంతరం ప్రతిభ కనబరిచిన టాప్ 3 వినూత్న బృందాలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో మరింత పరిశోధన, అభివృద్ధికి అవకాశం ఉన్న కొన్ని ప్రాజెక్టులను ఇన్నోవేషన్ హబ్‌లో తదుపరి పరిశీలనకు సిఫారసు చేశారు.ఈ కార్యక్రమానికి హెడ్ ఆఫ్ ఇంక్యుబేషన్ డా. డి. ప్రగతి, ప్రోగ్రామ్ అసోసియేటర్స్ పి. రెనిష్‌కుమార్, పి. కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు విద్యార్థులతో మమేకమై, వారి సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, వినూత్న ఆలోచనా విధానం, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభినందించారు.విద్యార్థుల్లో ప్రాక్టికల్ లెర్నింగ్, పరిశోధనాత్మక దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ విద్యా ప్రగతితో పాటు సమగ్ర విద్యార్థి అభివృద్ధికి తపస్య స్కూల్ చేస్తున్న కృషిని అతిథులు ప్రశంసించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ విక్రమ్ షాలి, డైరెక్టర్ కె. అనుషా గౌరవ అతిథులను ఘనంగా సత్కరించి, టాప్ 3 విజేత బృందాలకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలు, ప్రతిభను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని పరిశోధనాత్మక కార్యక్రమాలను నిర్వహించేందుకు పాఠశాల ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.

విద్యార్థుల్లో భాషా

# నైపుణ్యాన్ని పెంపొందించాలి

**డీఈఓ కె.వి.ఎస్.కుమార్**



**ఆంధ్రనాడు - నాగలాపురం, సెప్టెంబర్ 26:** మాతృభాషలో విద్యార్థులు వెనుకబడకుండా చదవడం, రాయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న లాంగ్వేజ్ టీచర్స్ సీఆర్సీ సమావేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న చిన్న పదాలు, సరళమైన వాక్యాలు, చిన్న కథలను చదివించడంతో పాటు వాటిని స్వయంగా రాయించేలా నిరంతరం సాధన చేయించాలని సూచించారు. మాతృభాషలో చదవడం, రాయడంలో పట్టు సాధించడం ద్వారా విద్యార్థుల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే "నేను చదవగలను.. నేను రాయగలను" అనే ఆత్మవిశ్వాసం విద్యార్థుల్లో పెంపొందుతుందని, తద్వారా వారు ఉన్నత విద్యను కూడా సమర్థవంతంగా అభ్యసించగలుగుతారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తరగతి గదిలో నిరంతర అభ్యాసం ద్వారా భాషా నైపుణ్యాలను మెరుగుపరచాలని డీఈఓ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బాబయ్య, స్థానిక ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి నుండి వైఎస్ఆర్సిపి పార్టీని

# మరింత బలోపేతం చేయడమే మా లక్ష్యం.

## వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి కె చెంగారెడ్డి వెల్లడి

**ఆంధ్రనాడు, పుంగనూరు, శనివారం సెప్టెంబర్ 26:** రాష్ట్ర వైఎస్ఆర్సిపి యువజన సంయుక్త కార్యదర్శి కె,చంగారెడ్డి మాట్లాడుతూ, ఈ రాష్ట్రంలో మా పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మా యువ నాయకుడు మిథున్ రెడ్డి ఆదేశాల మేరకు, వైఎస్ఆర్సిపి మున్సిపల్ విస్తృత స్థాయి సమావేశం జరపడం జరిగిందన్నారు, ఈ సందర్భంగా చంగారెడ్డి మాట్లాడుతూ మాజీమంత్రి పుంగనూరు ఎమ్మెల్యే మా పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,, మా యువ నాయకుడు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ల ఆదేశాల మేరకు,డేర్ అండ్ డైనమిక్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆశయాలకు అనుగుణంగా ఆంధ్ర రాష్ట్రం మరియు పుంగనూరు నియోజక వర్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించి మా నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారికి, మిథున్ రెడ్డి గారికి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారికి కానుకగా ఇవ్వాలని దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని , రాష్ట్ర వైఎస్ఆర్సిపి యువజన సంయుక్త కార్యదర్శి కె చంగారెడ్డి మీడియాకు తెలిపారు, ఈ కార్యక్రమంలో పుంగనూరు మండల వైఎస్ఆర్సిపి నాయకులు


కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

తిరుపతి నగరపాలక

# ఎన్నికలకు ముందడుగు

## 304 పోలింగ్ కేంద్రాల ముసాయిదా, 66 వార్డుల ఓటర్ల జాబితా ప్రచురణ



**ఆంధ్రనాడు, తిరుపతి, సెప్టెంబర్ 26** : తిరుపతి నగరపాలక సంస్థ 2వ సాధారణ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ ఎం.జయకృష్ణ అధ్యక్షతన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిసిపి దేవి కుమారి పాల్గొన్నారు.సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, త్వరలో జరగబోయే ఎన్నికల కోసం 304 పోలింగ్ కేంద్రాలతో ముసాయిదా జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ బూతులపై ఏమైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే తెలపాలని పార్టీలను కోరారు.మరోవైపు పురపాలక పరిపాలన శాఖ సంచాలకుల సర్కులర్ =శీఖ.13021/201/2026/జుశ్రీవఖ-1-3-2, తేదీ 22.09.2026 ప్రకారం 66 వార్డులకు సంబంధించిన ఎస్.టి./ ఎస్.సి./ మహిళా ఴ బి.సి. ల వార్డు వారీ ఓటర్ల జాబితాలను గురువారం 26.09.2026 న నగరపాలక కార్యాలయంలో ప్రచురించారు. ఈ జాబితాలు ప్రజల పరిశీలన కోసం నగరపాలక కార్యాలయ నోటీసు బోర్డు, ఆర్డీఓ, తహసీల్దార్ (తిరుపతి అర్బన్) కార్యాలయాల బోర్డుల్లో, సంబంధిత వార్డుల నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచారు. ప్రజలు తమ వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే 27.09.2026 మరియు 28.09.2026 తేదీల్లో లిఖితపూర్వకంగా నగరపాలక కార్యాలయానికి తెలియజేయాలని కమిషనర్ తెలియజేశారు.

ధన్వంతరి జయంతికి

# టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ కి ఆహ్వానం

**ఆంధ్రనాడు, తిరుపతి, సెప్టెంబర్ 26 :** నవంబర్ 6 వ తేదీ జరగబోయే నాయి బ్రాహ్మణుల ఆరాధ్య దైవం ధన్వంతరి జయంతి ఉత్సవాలకు తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి జేబీ శ్రీనివాస్ ను గ్రేటర్ తిరుపతి నగర నాయి బ్రాహ్మణ అభివృద్ధి సంఘం సభ్యులు ఆహ్వానించారు. శనివారం టిడిపి తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి జేబి శ్రీనివాస్ ను ఆయన కార్యాలయములో గ్రేటర్ తిరుపతి నాయి బ్రాహ్మణ అభివృద్ధి సంఘం అధ్యక్షులు సహదేవ జయకుమార్ నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి గల్లా దామో కోశాధికారి ఉప్పలపాటి శివయ్య గౌరవ అధ్యక్షులు అవిలాల ముని, వడ్లమూరి కమల్ లు వెళ్లి కలసి ధన్వంతరి జయంతి ఉత్సవాల కరపత్రాన్ని అందజేసి ఆహ్వానం పలికారు. తప్పకుండా హాజరవుతానని ఆయన వారికి హామీ ఇచ్చారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జయ కుమార్, గల్లా దాము, కోశాధికారి ఉప్పలపాటి శివయ్య మాట్లాడుతూ ధన్వంతరి జయంతిని ప్రతి ఏటా తమ నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ధన్వంతరి జయంతి ఉత్సవ కమిటీ సభాధ్యక్షులు ఆవులపాటి బుజ్జి బాబు, రాష్ట్ర ధన్వంతరి జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్లు కన్నెమడుగు రామనారాయణ, సిబ్యాల సుధాకర్ ల నేతృత్వంలో ఈ ఉత్సవాలను నవంబర్ 6 వ తేదీ కచ్చప్పి ఆడిటోరియంలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అందులో గ్రేటర్ తిరుపతి నాయి బ్రాహ్మణ అభివృద్ధి సంఘం సభ్యులమంతా భాగస్వాములుగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ మహోత్సవాలకు రాష్ట్ర నలు మూలల నుండి కూటమి ప్రభుత్వ ంలోని పెద్దలు, మేధావులు, విద్యా వంతులు, వైద్యులు, అన్ని జిల్లాలకు చెందిన బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరుకానున్నట్లు తెలిపారు. ధన్వంతరి జయంతిని నాయి బ్రాహ్మణులు తమ ఇష్ట దైవంగా భావించి ప్రతి ఏటా ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పలు జిల్లాల నుంచి వచ్చిన వారందరికీ సత్కరించనున్నట్లు తెలిపారు. కావున ఈ ధన్వంతరి జయంతి మహోత్సవానికి ఆహ్వానం అందుక న్న, సమాచారం తెలిసిన ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సహదేవ జయకుమార్, గల్లా దాము, ఉప్పలపాటి శివయ్య పిలుపునిచ్చారు.



# ఆసియా క్రీడల కబడ్డీలో భారత్ గోల్డెన్ డబుల్..

చంద్రబాబు, లోకేశ్ అభినందనలు
ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లకు డబుల్ గోల్డ్
పురుషుల, మహిళల ఫైనల్స్‌లో ఇరాన్‌పై ఘన విజయం
విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
ఇది కబడ్డీ స్టైల్ 'దుబ్కీ' అంటూ చంద్రబాబు ప్రశంస
బలం, నైపుణ్యం, పోరాట స్ఫూర్తి అద్భుతమన్న నారా లోకేశ్

**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో అద్భుత ప్రదర్శన చేశాయి. ఈ చారిత్రాత్మక విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేస్తూ జట్లకు అభినందనలు తెలిపారు. కబడ్డీలో భారత ఆధిపత్యం మరోసారి రుజువైందని వారు కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, "కబడ్డీలో భారత ఆధిపత్యం డబుల్ గోల్డ్‌తో కొనసాగింది. మన మహి ళల జట్టు తమ టైటిల్‌ను నిలబెట్టుకోగా, పురుషుల జట్టు కూడా ఐచి-నగోయాలో ఉత్కంఠభరిత విజయంతో మరో స్వర్ణాన్ని భారత్ ఖాతాలో చేర్చింది. ప్రపంచానికి సరైన కబడ్డీ స్టైల్ 'దుబ్కీ'ని రుచి చూపించారు. ఈ అద్భుత విజయం సాధించిన మన కబడ్డీ జట్టుకు నా అభినంద నలు. మీ అందరినీ చూసి భారత్ గర్విస్తోంది" అని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సైతం భారత జట్లను ప్రశంసించారు. "భారత్‌కు డబుల్ గోల్డ్! ఆసియా గేమ్స్ ఛాంపియన్‌లుగా నిలిచిన మన పురుషుల, మహిళల కబడ్డీ జట్లకు హృదయపూర్వక అభినందనలు. రెండు జట్లు కూడా బలం, నైపుణ్యం, పోరాట స్ఫూర్తిని అద్భుతంగా ప్రదర్శించాయి. మీరు దేశం మొత్తం గర్వపడేలా చేశారు. జై హింద్!" అని లోకేశ్ తన సందేశంలో తెలిపారు. శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌పైనే విజయం సాధించడం విశేషం. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లలో భారత క్రీడాకారులు అద్వితీయమైన ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ విజయాలతో కబడ్డీ క్రీడలో తమకు తిరుగులేదని భారత్ మరోసారి ప్రపంచానికి చాటి చెప్పింది.



# టీమిండియాకు గుడ్ న్యూస్..

తొలి వన్డేకు శుభ్‌మన్ గిల్ పూర్తి ఫిట్‌గా ఉన్నాడని ప్రకటన
ప్రాక్టీస్‌లో గాయపడ్డా కోలుకున్నాడని తెలిపిన బ్యాటింగ్ కోచ్
జైస్వాల్‌కు తీవ్ర పోటీ వల్లే జట్టులో చోటు దక్కడం లేదన్న కోటక్
రవీంద్ర జడేజా అనుభవం జట్టుకు ఎంతో కీలకమని ప్రశంస



**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** వెస్టిండీస్‌తో ఆదివారం జరగనున్న తొలి వన్డేకు ముందు టీమిండియాకు ఊరట లభించింది. కెప్టెన్, స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, మ్యాచ్ ఆడేందుకు అతను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టం చేశాడు. మ్యాచ్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించాడు. టీమిండియా, వెస్టిండీస్ మధ్య తిరువనంతపురంలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో తొలి వన్డే జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటి ప్రాక్టీస్ సెషన్‌లో ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ వేసిన బంతి గిల్ కుడి మోచేతికి బలంగా తాకింది. దీంతో మైదానంలోనే సుమారు 20 నిమిషాల పాటు అతనికి ప్రాథమిక చికిత్స అందించారు. ఈ పరిణామంతో గిల్ ఫిట్‌నెస్‌పై ఆందోళనలు వ్యక్తమయినప్పటికీ, గిల్ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడు, మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు" అని కోటక్ స్పష్టం చేయడంతో ఆ అనుమానాలకు తెరపడింది. ఇదే క్రమంలో యశస్వి జైస్వాల్‌కు తుది జట్టులో చోటు దక్కకపోవడంపై కోటక్ స్పందించాడు. "జట్టులో ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొంది. చాలా మంది ఆటగాళ్లు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. జైస్వాల్ అత్యంత ప్రతిభావంతుడైన ఆటగాడనడంలో సందేహం లేదు. అయితే రోహిత్, గిల్ ఓపెనర్లుగా కొనసాగుతుండటంతో అతనికి అవకాశం లభించడం లేదు. ఇది కేవలం జట్టు సమీకరణాల్లో భాగమే తప్ప, అతనికి జరుగుతున్న అన్యాయం కాదు" అని వివరించాడు. వన్డే జట్టులోకి పునరాగమనం చేసిన సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా గురించి మాట్లాడుతూ.. అతని అనుభవం జట్టుకు ఎంతో కీలకమని కొటక్ ప్రశంసించాడు. "జడేజా అద్భుతమైన ఆల్‌రౌండర్. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ అతను ప్రపంచస్థాయి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడు. రోహిత్, విరాట్, జడేజా వంటి సీనియర్ల అనుభవం జట్టుకు అదనపు బలాన్నిస్తుంది" అని పేర్కొన్నాడు.

ప్రత్యేక అధికారిగా బాధ్యత

# స్వీకరించిన యం.బాలాజీ నాయక్



**ఆంధ్రనాడు - నాగలాపురం, సెప్టెంబర్ 26 :** నాగలాపురం మండలనికి ప్రత్యేక అధికారిగా జిల్లా మైనింగ్ - భూగర్భ శాస్త్రం అధికారి యం.బాలాజీ నాయక్ ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇంచార్జ్ ఎంపీడీవో గుణశేఖర్, సిబ్బంది సుధాకర్, డిజిటల్ అసిస్టెంట్ మాలిక్ బాషా, కంప్యూటర్ ఆపరేటర్ ఢిల్లీ బాబు, పలువురు ప్రత్యేక అధికారికి సాలువ కప్పి పూలమాలవేసి అభినందనలు తెలియజేశారు.

సమస్యల పరిష్కారం కోసం

# శ్రీకాళహస్తిలో వీఆర్ఏల నిరసన



**ఆంధ్రనాడు - శ్రీకాళహస్తి , సెప్టెంబర్ 26 :** తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం వీఆర్ఏలు సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టారు . శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వీఆర్ఏలు ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు . ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మద్దెల బాలగురవయ్య మాట్లాడుతూ.. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, వీఆర్ఏల వారసులను నామినీలుగా నియమించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో సి.రమణయ్య, శివ , భవాని , దుర్గాప్రసాద్ , వెంకటేసు , మురళి తదితరులు పాల్గొన్నారు .

# మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానం

**ఆంధ్రనాడు - శ్రీకాళహస్తి , సెప్టెంబర్ 26 :** శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని పలు మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు . శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో 3, ఏర్పేడు పరిధిలో 3, తొట్టంబేడు పరిధిలో 3, బీఎన్‌కండ్రిగ పరిధిలో 1 కేటాయించినట్లు తెలిపారు. ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షలు, రూ.వెయ్యి ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 24 నుంచి అక్టోబరు 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3న వెరిఫికేషన్, 5న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో దుకణాలు కేటాయింపు జరుగుతుందన్నారు.

# తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడసేవ



**ఆంధ్రనాడు, తిరుమల, సెప్టెంబర్ 26 :** తిరుమలలో శనివారం రాత్రి పౌర్ణమి గరుడసేవ అత్యంత వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితు డైన శ్రీ మలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

**గరుడ వాహనం -- సర్వపాప ప్రాయశ్చిత్తం**

పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు.ఈ వాహనసేవలో తిరుమల పెద్ద జీయర్ స్వామి చిన్న జీయర్ స్వామి, టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మట్లివారిపల్లిలో

# సీసీ రోడ్డుకు భూమిపూజ



**ఆంధ్రనాడు - కురబలకోట, సెప్టెంబరు 26:** కురబలకోట మండలం మట్లివారిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ శనివారం భూమిపూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సమావేశమై గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నాకు 2027 ప్రపంచకప్పే ఆఖరిది..

గెలిచేందుకు ఏమైనా చేస్తా: కోహ్లీ
2027 వన్డే ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని ప్రకటించిన కోహ్లీ
కప్ గెలిచేందుకు ఎంతకైనా సిద్ధమని, అదే తనకు ప్రేరణ అని స్పష్టీకరణ
50 ఓవర్ల ఫార్మాట్ ఉత్కంఠ చాలా ఎక్కువన్న విరాట్
వెస్టిండీస్‌తో రేపటి నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్



**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన కెరీర్‌కు సంబంధించి ఒక కీలక ప్రకటన చేశాడు. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగబోయే ఐసీసీ వన్డే ప్రపంచకప్ తన కెరీర్‌లో ఆఖరిదని స్పష్టం చేశాడు. ఆ మెగా టోర్నీని గెలిచి, కెరీర్‌ను ఘనంగా ముగించడమే తన లక్ష్యమని, దానికోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో రేపటి నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కు ముందు 'జియోస్టార్'తో మాట్లాడుతూ కోహ్లీ ఈ వ్యాఖ్యలు చేశాడు. 50 ఓవర్ల ప్రపంచకప్ ప్రాముఖ్యతను వివరిస్తూ కోహ్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "50 ఓవర్ల ప్రపంచకప్‌లో ఉండే ఉత్కంఠ మరే టోర్నీలోనూ ఉండదు. ఒకే రోజులో దాదాపు రెండున్నర టీ20 మ్యాచ్‌లు ఆడినంత శ్రమ ఉంటుంది. ఆ తీవ్రతను దాదాపు 10 మ్యాచ్‌ల పాటు విదేశీ గడ్డపై కొనసాగించడం చాలా పెద్ద విషయం. అది శారీరకంగా, మానసికంగా ఎంతో పరీక్షిస్తుంది" అని కోహ్లీ వివరించాడు. "భారత్ తరపున నేను ఆడబోయే చివరి ప్రపంచకప్ ఇదే. అదే నాకు గొప్ప ప్రేరణ. నా సర్వస్వాన్ని పణంగా పెట్టి ఆడాలనుకుంటున్నాను. ప్రపంచకప్ గెలవడమే మా అంతిమ లక్ష్యం. దానికోసం ఎలాంటి త్యాగానికైనా నేను సిద్ధం" అని విరాట్ అన్నాడు. ప్రపంచకప్ చరిత్రలో కోహ్లీకి అద్భుతమైన రికార్డు ఉంది. ఇప్పటివరకు 37 వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లలో 59.83 సగటుతో 1,795 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 12 అర్ధ సెంచరీలు ఉన్నాయి. తన మొత్తం వన్డే కెరీర్‌లో 302 ఇన్నింగ్స్‌లలో 54 సెంచరీలతో 14,941 పరుగులు సాధించాడు. ఇదే సమయంలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ప్రపంచకప్‌పై తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. అయితే, దీనిని తాను అసంపూర్తిగా మిగిలిపోయిన పనిగా భావించడం లేదని అన్నాడు. "నేను ఆడుతున్నంత కాలం, ముందు ఎప్పుడూ ఒక కొత్త లక్ష్యం ఉంటుంది. ఇప్పుడు నా దృష్టి రాబోయే ప్రపంచకప్‌పై ఉంది" అని రోహిత్ తెలిపాడు. "ఐసీసీ టోర్నమెంట్‌లలో ఆడటం ఒక ప్రత్యేకమైన సవాల్. వేర్వేరు ప్రత్యర్థులతో, భిన్నమైన వేదికలపై ఆడాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్టుగా సన్నద్ధం కావాలి" అని పేర్కొన్నాడు. టీమిండియా కొత్త హోమ్ సీజన్ రేపటి వెస్టిండీస్‌తో జరిగే తొలి వన్డేతో ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతుంది. జియోహాట్‌స్టార్, స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

# భారత్ ఖాతాలో మరో గోల్డ్

ఉత్కంఠభరిత విజయం
టైటిల్‌ను నిలబెట్టుకున్న భారత అమ్మాయిలు



**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** ఆసియా క్రీడలు 2026లో భారత మహిళల కబడ్డీ జట్టు స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో ఇరాన్‌పై 37-33 పాయింట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత జట్టు తమ టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచి చివరి వరకు హోరాహోరీగా సాగింది. ద్వితీయార్థంలో ఒక దశలో 36-31 తేడాతో భారత్ ఆధిక్యంలో ఉన్నప్పటికీ, ఇరాన్ గట్టి పోటీ ఇచ్చింది. అయితే, చివరి నిమిషాల్లో భారత అమ్మాయిలు ఒత్తిడిని అధిగమించి కీలక పాయింట్లు సాధించారు. ఫైనల్ విజిల్ మోగేసరికి నాలుగు పాయింట్ల ఆధిక్యంతో స్వర్ణాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ విజయంతో భారత పతకాల సంఖ్య 27కి (3 స్వర్ణాలు, 11 రజతాలు, 13 కాంస్యాలు) చేరింది. ఈరోజు దేశానికి అందిన నాలుగో పతకం ఇది. ఇక, కాసేపట్లో జరగనున్న పురుషుల కబడ్డీ ఫైనల్‌లో కూడా భారత జట్టే ఇరాన్‌తో తలపడనుండటంతో క్రీడాభిమానుల్లో ఆసక్తి రెట్టింపైంది.

# అతనికి ఆ సత్తా ఉంది: కోహ్లీ

భారత జట్టుకు గిల్ దీర్ఘకాల కెప్టెన్‌గా ఉంటాడని కోహ్లీ విశ్వాసం
గిల్‌కు సరైన దృక్పథం, నడిపించే సత్తా ఉన్నాయని ప్రశంస
ఫీల్డ్ ప్లేస్‌మెంట్లు, వ్యూహాల్లో గిల్ స్పష్టతను కొనియాడిన కోహ్లీ
గత 10 వన్డేల్లో స్వేచ్ఛగా ఆడటం వల్లే రాణిస్తున్నానని వెల్లడి
వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ నేపథ్యంలో కోహ్లీ వ్యాఖ్యలు



**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** భారత క్రికెట్ జట్టు యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై టీమిండియా సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రశంసల వర్షం కురిపించాడు. గిల్‌కు జట్టును సుదీర్ఘకాలం నడిపించే సత్తా, సరైన దృక్పథం ఉన్నాయని కొనియాడాడు. వెస్టిండీస్‌తో రేపటి నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కు ముందు బ్రాడ్‌కాస్టర్లతో మాట్లాడుతూ కోహ్లీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "కెప్టెన్‌గా శుభ్‌మన్ ఇంకా నేర్చుకుంటున్నాడు. ఈ పాత్రలో అతను యువకుడు. కానీ, భారత జట్టుకు నాయకత్వం వహించడానికి అవసరమైన సరైన దృక్పథం, తగినంత తీవ్రత అతనిలో ఉన్నాయి" అని కోహ్లీ పేర్కొన్నాడు. ఫీల్డ్ ప్లేస్‌మెంట్లు, వ్యూహాల రూపకల్పనలో గిల్‌కు ఉన్న స్పష్టతను కోహ్లీ ప్రత్యేకంగా అభినందించారు. వినూత్నమైన ఫీల్డింగ్ సెటప్‌లతో బ్యాటర్లపై ఒత్తిడి తేవడం, బౌలర్లతో సమర్థంగా కమ్యూనికేట్ చేయడం వంటి లక్షణాలు గిల్‌లో ఉన్నాయని వివరించాడు. "భారత జట్టును సరైన మార్గంలో నడిపించాలనే తపన అతనిలో ఉంది. ఇదే అత్యంత ముఖ్యమైన అంశం. అతను సుదీర్ఘకాలం జట్టును నడిపించగలడని నేను భావిస్తున్నాను. అందులో ఎలాంటి సందేహం లేదు" అని కోహ్లీ ధీమా వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా తన ఇటీవలి ఫామ్ గురించి కూడా కోహ్లీ మాట్లాడాడు. తాను ఆడిన గత 10 వన్డేలలో మూడు సెంచరీలు, ఒక 90కి పైగా స్కోరు, నాలుగు అర్ధ సెంచరీలు సాధించడాన్ని గుర్తుచేశాడు. మరింత స్వేచ్ఛగా ఆడటం, లెక్క ప్రకారం రిస్కులు తీసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని తెలిపాడు. క్రీజులో కుదురుకున్న తర్వాత జట్టు స్కోరును 350-360 పరుగులకు చేర్చడమే లక్ష్యంగా అదనపు పరుగులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నానని తన బ్యాటింగ్ విధానాన్ని వివరించాడు. తిరువనంతపురం వేదికగా వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు భారత్ సిద్ధమవుతున్న తరుణంలో కోహ్లీ చేసిన ఈ వ్యాఖ్యలు గిల్ ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచేలా ఉన్నాయి.

టీమిండియాకు టెన్షన్..

# కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు గాయం!

వెస్టిండీస్‌తో తొలి వన్డేకు ముందు కెప్టెన్ గిల్‌కు గాయం
నెట్ ప్రాక్టీస్‌లో సిరాజ్ బౌలింగ్‌లో మోచేతికి తాకిన బంతి
వెంటనే మైదానం వీడిన గిల్‌కు 20 నిమిషాల పాటు చికిత్స
ఆదివారం నాటి మ్యాచ్‌లో గిల్ ఆడటంపై అనుమానాలు
ఇప్పటికే గాయాలతో పలువురు కీలక ఆటగాళ్లు జట్టుకు దూరం



ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 : వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు భారత జట్టులో ఆందోళన నెలకొంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నెట్ ప్రాక్టీస్‌లో గాయపడ్డాడు. ఆదివారం తొలి వన్డే జరగనుండగా, శుక్రవారం జరిగిన నెట్ సెషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పేసర్ మహ్మద్ సిరాజ్ వేసిన బంతి అనూహ్యంగా బౌన్స్ అయి నేరుగా గిల్ కుడి మోచేతికి బలంగా తాకింది. బంతి తగలగానే గిల్ తీవ్రమైన నొప్పితో బ్యాట్‌ను కింద పడేసి మైదానం వీడాడు. వెంటనే జట్టు ఫిజియోథెరపిస్ట్ కమలేశ్ జైన్ అతడికి దాదాపు 20 నిమిషాల పాటు చికిత్స అందించారు. పక్క నెట్‌లో ప్రాక్టీస్ చేస్తున్న విరాట్ కోహ్లీతో పాటు, బౌలింగ్ చేసిన సిరాజ్ కూడా వెంటనే గిల్ వద్దకు పరుగెత్తుకెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయం తీవ్రత కారణంగా గిల్ మళ్లీ బ్యాటింగ్‌కు రాలేదు. ఇప్పటికే హార్దిక్ పాండ్యా, హర్షిత్ రాణా వంటి కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా జట్టుకు దూరమైన నేపథ్యంలో గిల్ గాయపడటం టీమ్ మేనేజ్‌మెంట్‌ను మరింత కలవరపెడుతోంది. గత నెలలో శ్రీలంక పర్యటనలోనూ గిల్‌కు చేతివేలికి గాయమైనా, కోలుకుని సిరీస్‌లో పాల్గొన్నాడు. ప్రస్తుతం గిల్ గాయాన్ని జట్టు యాజమాన్యం నిశితంగా పరిశీలిస్తోంది. ఆదివారం నాటి మ్యాచ్‌లో అతని లభ్యతపై త్వరలో స్పష్టత రానుంది. మరోవైపు, భారత ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. కాగా, ఈ నెల 23నే నగరానికి చేరుకున్న వెస్టిండీస్ జట్టు ఇంకా ప్రాక్టీస్ ప్రారంభించలేదు.

# 7 స్వర్ణాలతో సరికొత్త చరిత్ర

ఆసియా క్రీడల్లో చైనా స్విమ్మర్ జాంగ్ జన్షువో సంచలన ప్రదర్శన
అరంగేట్రంలోనే 7 స్వర్ణ పతకాలు సాధించిన 19 ఏళ్ల జన్షువో
ఒకే ఏషియన్ గేమ్స్‌లో 7 స్వర్ణాలు గెలిచిన తొలి స్విమ్మర్‌గా రికార్డు
1982 నాటి రికార్డును సమం చేసిన జాంగ్



**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** టోక్యోలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో చైనాకు చెందిన 19 ఏళ్ల స్విమ్మర్ జాంగ్ జన్షువో అద్భుతం సృష్టించాడు. తాను పాల్గొన్న తొలి ఏషియన్ గేమ్స్‌లోనే ఏకంగా ఏడు స్వర్ణ పతకాలు సాధించి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. శుక్రవారం జరిగిన పురుషుల 400 మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచిన వెంటనే, అతను ఏడు స్వర్ణాలను సూచిస్తూ చేతివేళ్లతో సైగ చేశాడు. ఈ విజయంతో, ఒకే ఆసియా క్రీడల ఎడిషన్‌లో ఏడు స్వర్ణాలు గెలిచిన తొలి స్విమ్మర్‌గా జాంగ్ రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా, 1982లో ఉత్తర కొరియా షూటర్ సో గిల్-సాన్ నెలకొల్పిన అత్యధిక స్వర్ణాల రికార్డును సమం చేశాడు. గతేడాది ఆరు స్వర్ణాలు గెలిచిన తన సహచర స్విమ్మర్ జాంగ్ యుఫెయ్ రికార్డును కూడా అధిగమించాడు. జాంగ్ ఈ పతకాలను 200, 400, 800, 1500 మీటర్ల ఫ్రీస్టైల్ వ్యక్తిగత విభాగాలతో పాటు, పురుషుల 4x100 మీ, 4x200 మీ ఫ్రీస్టైల్ రిలే, మిక్స్‌డ్ 4x100 మీ మెడ్లే రిలే ఈవెంట్లలో గెలుచుకున్నాడు. ఈ ఘనత సాధించినప్పటికీ జాంగ్ చాలా ప్రశాంతంగా కనిపించాడు. ఏషియన్ గేమ్స్ తన అంతిమ లక్ష్యం కాదని, లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రపంచంలోని అత్యుత్తమ స్విమ్మర్లతో పోటీ పడటమే తన ధ్యేయమని చెప్పాడు. రాబోయే రెండేళ్లలో ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడమే తన తదుపరి లక్ష్యమని స్పష్టం చేశాడు. ఈ క్రీడల్లో తన ప్రదర్శనకు 100కి 85 మార్కులు ఇచ్చుకున్న జాంగ్.. టెక్నిక్ పరంగా మరింత మెరుగుపడాల్సి ఉందని, ఈ స్వర్ణాలు తనకు మరింత ప్రేరణ ఇస్తాయని తెలిపాడు.

# ఫోకస్ అంతా రో-కో పైనే..

51 పరుగులు చేస్తే కోహ్లీ చరిత్ర!
తిరువనంతపురంలో భారత్-వెస్టిండీస్ తొలి వన్డే
15 వేల వన్డే పరుగులకు 51 రన్స్ దూరంలో కోహ్లీ
హార్దిక్, హర్షిత్ రాణా గాయాలతో దూరం
ఆసియా క్రీడల్లో అక్షర్, వాషింగ్టన్
నితీశ్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కే ఛాన్స్



**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** టీమిండియా స్వదేశీ సీజన్‌కు సిద్ధమైంది. వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఆదివారం జరగనుంది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం ఈ పోరుకు వేదిక కానుంది. ఈ మ్యాచ్‌లో అందరి చూపు సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపైనే ఉంది. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌కు భారత్ ఇప్పటి నుంచే సన్నద్ధమవుతోంది. అయితే గాయాలు, ఆసియా క్రీడల కారణంగా పలువురు కీలక ఆటగాళ్లు జట్టుకు దూరమయ్యారు. దీంతో అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో జట్టు కూర్పు ఎలా ఉంటుందన్నది ఆసక్తిగా మారింది. ఇటీవల ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ 138 పరుగులతో అదరగొట్టాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత 15 ఇన్నింగ్స్‌ల్లో రెండు సెంచరీలు చేశాడు. అయితే ఎనిమిది సార్లు 30లోపే ఔటయ్యాడు. పవర్‌ప్లేలో అతడి బ్యాటింగ్ వేగంపైనా చర్చ జరుగుతోంది. మరోవైపు విరాట్ కోహ్లీ అరుదైన మైలురాయికి చేరువలో ఉన్నాడు. వన్డేల్లో 15 వేల పరుగులు పూర్తి చేసేందుకు అతడికి 51 పరుగులు మాత్రమే కావాలి. ఈ ఘనత సాధిస్తే సచిన్ తర్వాత ఆ మార్క్‌ను అందుకున్న రెండో ఆటగాడిగా నిలుస్తాడు. గత 12 వన్డేల్లో ఎనిమిది సార్లు 50కిపైగా పరుగులు చేశాడు.

**నితీశ్ కు చాన్స్ పక్కా!**

హార్దిక్ పాండ్యా, హర్షిత్ రాణా గాయాలతో జట్టుకు దూరమయ్యారు. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆసియా క్రీడల కోసం వెళ్లారు. దీంతో నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు చేపట్టనున్నారు. న్యూజిలాండ్, శ్రీలంకతో సిరీస్‌లు కోల్పోయిన వెస్టిండీస్ ఈ సిరీస్‌లో సత్తా చాటాలని చూస్తోంది. వచ్చే ఏడాది ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌కు ముందు ఈ సిరీస్ ఆ జట్టుకు కీలకం. 19 ఏళ్ల స్పిన్నర్ విటెల్ లాస్‌పైనా ఆసక్తి నెలకొంది. 5 వన్డేల్లో అతడు 8 వికెట్లు పడగొట్టాడు. మ్యాచ్ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది. జియోహాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ చూడొచ్చు.

# ఏషియన్ గేమ్స్‌లో సింధు జోరు..

ప్రీ-క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన స్టార్ షట్లర్
రౌండ్-16లోకి దూసుకెళ్లిన సింధు
చియు పిన్-చియాన్‌పై 21-19, 21-14తో గెలుపు



**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** ఏషియన్ గేమ్స్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు దూసుకెళుతోంది. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన చియు పిన్-చియాన్‌పై 21-19, 21-14 తేడాతో విజయం సాధించింది. దీంతో రౌండ్-16 (ప్రీక్వార్టర్ ఫైనల్) లోకి ప్రవేశించింది. తొలి గేమ్‌లో సింధుకు ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైంది. బ్రేక్ సమయానికి ఆమె 10-11తో వెనుకబడింది. ఆ తర్వాత పుంజుకున్న సింధు ఆధిక్యంలోకి వచ్చింది. రెండు గేమ్ పాయింట్లను చేజార్చుకున్నప్పటికీ.. మూడో గేమ్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకుని తొలి గేమ్‌ను 21-19తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా ఆడింది. బ్రేక్ సమయానికి 11-7తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా 21-14తో గేమ్‌ను ముగించింది. 2-0తో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. రౌండ్-16లో సింధు జపాన్‌కు చెందిన తోమోకా మియాజాకితో తలపడనుంది. ఈ మ్యాచ్ శనివారమే జరగనుంది. గతంలో ఇదే ఏషియన్ గేమ్స్‌లో మహిళల టీమ్ క్వార్టర్‌ఫైనల్లో భారత్.. జపాన్ చేతిలో ఓడింది. గత హాంగ్‌జౌ ఏషియన్ గేమ్స్‌లో మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోనే సింధు నిష్క్రమించింది. ఈసారి పతకం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. ఇక భారత యువ షట్లర్ ఉన్నతి హుడా కూడా రౌండ్-16కు చేరింది. రెండో రౌండ్‌లో మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌పై 21-14, 20-22, 21-9తో గెలిచింది. మరోవైపు, పురుషుల సింగిల్స్ విభాగంలో ఆయుష్ శెట్టి కజకిస్థాన్‌కు చెందిన మఖ్సుత్ తజిబుల్లయేవ్‌పై 21-7, 21-7తో విజయం సాధించాడు. అయితే లక్ష్యసేన్ రెండో రౌండ్‌లో సింగపూర్‌కు చెందిన లోహ్‌కీన్‌యూపై 12-21, 21-15, 14-21తో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

ఓడిపోయే మ్యాచ్‌ను

# గెలిపించి హీరో అయిన గుకేశ్

జర్మనీపై కీలక విజయం సాధించిన భారత పురుషుల జట్టు
ఓటమి అంచున నిలిచి జట్టును గెలిపించిన గుకేశ్
ఉజ్బెకిస్థాన్‌ను ఓడించి సత్తా చాటిన మహిళల జట్టు
పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరిన భారత జట్లు
టైటిల్ గెలుపు అవకాశాలను సజీవంగా నిలుపుకున్న భారత్



**ఆంధ్రనాడు, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** 46వ ఫిడే చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్లు అద్భుత ప్రదర్శనతో టైటిల్ రేసులోకి దూసుకొచ్చాయి. తొమ్మిదో రౌండ్‌లో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ అసాధారణ పోరాటంతో జట్టుకు విజయాన్ని అందించాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ 2.5-1.5 తేడాతో జర్మనీపై గెలుపొందింది. ఈ విజయంతో భారత పురుషుల జట్టు 15 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. జర్మనీతో జరిగిన కీలక మ్యాచ్‌లో తొలి మూడు బోర్డులపై ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేశి, నిహాల్ సరీన్ తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. దీంతో మ్యాచ్ ఫలితం గుకేశ్ ఆడే నాలుగో బోర్డుపై ఆధారపడింది. అలెగ్జాండర్ డొంచెంకోతో జరిగిన గేమ్‌లో గుకేశ్ ఓటమి అంచు వరకు వెళ్లాడు. అయితే, చివరి క్షణాల్లో అనూహ్యంగా పుంజుకుని, అద్భుతమైన ఎత్తులతో గేమ్‌ను సొంతం చేసుకుని భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. మరోవైపు, మహిళల విభాగంలోనూ భారత జట్టు సత్తా చాటింది. ఉజ్బెకిస్థాన్‌పై 3-1 తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కోనేరు హంపి, సవిత శ్రీ తమ గేమ్‌లను డ్రా చేసుకోగా.. దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ విజయాలు సాధించి జట్టుకు గెలుపును ఖాయం చేశారు. వరుసగా ఏడు విజయాలు సాధించిన సవిత శ్రీ జోరుకు ఈ మ్యాచ్‌తో బ్రేక్ పడినా, ఆమె అజేయంగా నిలిచింది. తాజా విజయాలతో పురుషుల జట్టు 16 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న ఉజ్బెకిస్థాన్ తర్వాతి స్థానంలో నిలిచింది. మహిళల జట్టు 15 పాయింట్లతో కజకిస్థాన్, మంగోలియాలతో కలిసి రెండో స్థానంలో ఉంది. ఈ విభాగంలో చైనా 17 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSSComplex, Air Bypass Road, Tirupati District, A.P. Published at AKSHARA PUBLICATIONS, Tirupati.Editor: M. Hari Babu, Cell: 9490400684, RNI : 2009/28733